


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 79

సోమవారం 10-6-2024

SIMULTANEOUSLY PRINTED AT KHAMMAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


తెలుగు రాష్ట్రాలు గర్వించేలా... తెలుగు విద్యార్థి గర్వపడేలా...
Infinity Learn
IIT JEE ADVANCED ఫలితాల్లో శ్రీచైతన్య హైదరాబాద్ విద్యార్థుల విశ్వరూపం
(మాదాపూర్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచ్‌లు)
ALL-INDIA ALL CATEGORY BELOW 10 RANKS
ఆలిండియా 1 RANK BIBASWAN BISWAS* H.T. NO: 245058146 (SC)
ఆలిండియా 3 RANK SALLURI VIVEK H.T. NO: 246133127 (SC)
ఆలిండియా 4 RANK VASANTA SRIRAJ H.T. NO: 246162238 (ST)
ఆలిండియా 5 RANK HIMANSHU THALOR* H.T. NO: 242050438 (OBC)
ఆలిండియా 6 RANK RAJDEEP MISHRA* H.T. NO: 241016176
ఆలిండియా 8 RANK P V S D SAI MOHITH H.T. NO: 246008172 (EWS)
ఆలిండియా 9 RANK M E VENKATA PARTHIV H.T. NO: 246162250 (EWS)
ఆలిండియా 10 RANK A S S D B SIDHVIK SUHAS H.T. NO: 246119101
ఆలిండియా ఓపెన్ కేటగిరిలో శ్రీచైతన్య సాధించిన టాప్ 1000లోపు 203 ర్యాంకులు
106 112 120 122 123 124 125 135 142 145 149
150 152 154 156 160 164 165 167 169 172 175
178 180 181 183 185 192 204 206 207 210 213
214 215 219 223 224 227 228 233 235 238 242
244 248 249 252 253 259 260 264 274 275 283
297 299 304 308 311 318 326 333 334 339 353
355 369 379 384 393 395 399 401 402 405 406
410 420 421 431 435 436 440 454 465 467 470
481 484 494 495 508 509 519 522 525 544 551
556 573 579 591 599 600 604 617 620 645 647
658 662 670 671 685 690 693 694 696 704 708
712 713 714 716 720 724 725 729 740 764 767
772 779 780 784 787 792 795 802 803 804 807
808 809 813 836 838 839 844 845 846 852 873
874 879 880 891 898 899 909 926 928 929 935
944 945 973 976 997 998 999 1000
Congratulations
IIT-JEE MAIN & ADVANCED
LONGTERM 2025
క్లాసులు 15 జూన్ 2024 నుండి ప్రారంభం
ADMISSIONS OPEN
HYDERABAD
BOYS RESIDENTIAL - 91000 65899 / 91774 22235 87126 00768 / 87126 00769
GIRLS RESIDENTIAL - 91770 46533 / 91000 91871 89779 05063 / 89779 05064
DAY SCHOLARS - 99486 76603 / 98661 08338
ALL INDIA / STATE RANKS | JEE MAIN-2024 | JEE ADV-2024 | AP EAPCET | TS EAPCET
<=2500 | 100% | 100% | 80% | 80%
<=5000 | 100% | 100% | 60% | 60%
<=10000 | 75% | 75% | 30% | 30%
<=20000 | 50% | 50% | 20% | 20%
SC/ST/PW BEST RANKERS | 60% | 60% | |
*Best of one is taken into Consideration
Scan QR code for WEBSITE
ADMISSIONS OPEN
Knowledge Hub
NEET | IIT JEE | FOUNDATION
COACHING CENTRES
www.srichaitanyaknowledgehub.com
KUKATPALLY : 91774 44352
AMEERPET : 95151 11054
KONDAPUR : 95151 11428
VISAKHAPATNAM : 91774 44307
DILSUKHNAGAR : 91774 44326
HIMAYATNAGAR : 91774 44341
TRIMULGHERRY : 91774 44837
www.srichaitanya.net
*T & C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice | Note: The information is as per students feedback | *DLP / AITS

సాక్షి ఖమ్మం

సోమవారం । 10 । జూన్ । 2024



ఉత్పత్తి ఉత్తుత్తిదే...

వైరాలోని మత్స్య విత్తన కేంద్రంలో వేధిస్తున్న సమస్యలు. సౌకర్యాల లేమితో చేపల ఉత్పత్తి లక్ష్యం మేర జరగడం లేదు. 4లో



అన్నీ ఆలస్యమే..

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో భద్రాచలంలో చేపట్టిన పనులేవీ సకాలంలో పూర్తి కావడం లేదు. నిధుల కొరతే దీనికి కారణమని తెలుస్తోంది. 2లో

గరిష్టం / కనిష్టం
33° / 26°

వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. సాయంత్రం అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు

ఖమ్మం స్పోర్ట్స్ : కర్ణాటక రాష్ట్రంలోని బాగల్‌కోట్‌లో జరిగే సౌత్‌జోన్ మహిళల జాతీయ స్థాయి పోటీల్లో ఆడేందుకు రాష్ట్ర జట్టుకు జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపికయ్యారు. ఈ మేరకు క్రీడాకారిణులు పి.పవిత్రాచారి, టి.సాయిభవ్యశ్రీ రాష్ట్ర జట్టులో స్థానం సాధించారు. జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారిణులు జాతీయస్థాయిలో ప్రతిభ చాటాలని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి, కోచ్ పి.పరిపూర్ణాచారి ఆకాంక్షించారు.

'బెస్ట్ అవైలబుల్'కు రేపు లాటరీ ద్వారా ఎంపిక

ఖమ్మంమయూరిసెంటర్ : ఎస్సీ అభివృద్ధి శాఖ ద్వారా నిర్వహిస్తున్న బెస్ట్ అవైలబుల్ పథకానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను ఎంపిక చేసేందుకు ఈనెల 11న ఖమ్మం కొత్త మున్సిపాలిటీ సమీపంలోని డీపీఆర్‌సీ భవనంలో లాటరీ తీయనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ఎంపికకు ఉదయం 11 గంటలకు, ఐదో తరగతిలో ప్రవేశాలకు మధ్యాహ్నం 2 గంటలకు లాటరీ తీస్తామని వివరించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు వారికి సూచించిన సమయాల్లో హాజరు కావాలని కోరారు.

జేసీజే మోడల్ టెస్ట్ విజయవంతం

ఖమ్మం లీగల్ : ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి మోడల్ టెస్ట్ విజయవంతమైందని ఐలు ప్రతినిధులు తెలిపారు. ఖమ్మం బార్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన ఈ పరీక్షకు మంచి స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఐలు కేంద్ర కమిటీ సభ్యుడు ఏడునూతల శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి మందడపు శ్రీనివాసరావు, మీసాల వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నల్లమల నవీన్ చైతన్య, కార్యదర్శి చింతనిప్పు వెంకట్, నాయకులు జక్కంపూడి నాగేశ్వరరావు, తన్నీరు పాపయ్య, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు ఉపాధ్యాయులు



సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్ : రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ సంబంధిత ఉపాధ్యాయుల జాబితా విడుదల చేసింది. ఈ నేపథ్యంలో సర్టిఫికెట్ల పరిశీలనకు అందరూ ఆదివారం హాజరు కావాలని సూచించింది. దీంతో ఖమ్మం ఇందిరానగర్ హైస్కూల్ వద్ద హిందీ, ఉర్దూ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు, రోటరీ నగర్ హైస్కూల్‌లో తెలుగు పండిట్లకు, నయాబజార్ హైస్కూల్‌లో పీఈటీల సర్టిఫికెట్లు పరిశీలించారు. పండిట్లు, పీఈటీలు కలిపి మొత్తం 552 మందికి గాను 530 మంది హాజరై సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నారు. ఇందులో పీఈటీలు 120 మందికి 105 మంది, హిందీ సబ్జెక్టుకు 212కు 206 మంది, తెలుగు సబ్జెక్టుకు 220 మందికి 219 మంది హాజరయ్యారు. ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 10, 11 తేదీల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. కాగా, పోస్టుల అప్‌గ్రేడేషన్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు పోస్టులు 18, స్థానిక సంస్థల పాఠశాలల్లో 199, హిందీ పండిట్లు ప్రభుత్వ పాఠశాలల్లో 16, స్థానిక సంస్థల పరిధిలో 185, పీఈటీలు ప్రభుత్వ పాఠశాలల్లో 12, స్థానిక సంస్థల పరిధిలో 95 పోస్టులు అప్‌గ్రేడేషన్ అయ్యాయి. జిల్లాలో 630 స్కూల్ అసిస్టెంట్ ఖాళీలున్నాయని విద్యా శాఖ లెక్క తేల్చింది.

రామయ్యకు అభిషేకం

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం గావించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ స్వామివారిని గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి చిత్రకూట మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.



తల్లి పరీక్షకు వెళ్తుంటే రోదిస్తున్న పిల్లలు..



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



ఉదయం 10 గంటలకు గేట్ తాళం వేస్తూ..

గ్రూప్-1 ప్రశాంతం



ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు (ఇన్‌సెట్) సత్తుపల్లి నుంచి వచ్చిన యలమర్తి పార్వతి

- ప్రిలిమినరీ పరీక్షకు 13,855 మంది హాజరు
- నిమిషం నిబంధనతో అభ్యర్థుల ఉరుకులు.. పరుగులు
- పలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్
- పటిష్ట పోలీస్ బందోబస్తు నడుమ పరీక్ష

ఖమ్మం సహకారనగర్ : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పరీక్ష నిర్వహించగా అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఆయా కేంద్రాల వద్ద ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లాలోని 52 పరీక్ష కేంద్రాల్లో 18,403 మంది అభ్యర్థులకు గాను 13,855 మంది హాజరు కాగా 4,548 మంది గైర్హాజరయ్యారు. టీఎస్‌పీఎస్‌సీ నిబంధనలను అధికారులు పటిష్టంగా అమలుచేశారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. కాగా, పలువురు దివ్యాంగులు, మరుగుజ్జులు, వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం పరీక్షకు హాజరు కావడం గమనార్హం.

భారీ బందోబస్తు..

పరీక్ష కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రాల్లోకి పంపించారు. కొద్దిమంది అభ్యర్థులు సెల్‌ఫోన్లు, ఇతర సామగ్రి తెచ్చుకోగా వాటిని క్లాక్‌రూమ్‌ల్లో భద్రపర్చుకోవాలని సూచించారు. షూ, ఇతర వస్తువులతో వచ్చిన అభ్యర్థులు.. వాటిని తొలగించిన తర్వాతే అనుమతించారు.

చివరి నిమిషాల్లో ఉరుకులు..

కొద్దిమంది అభ్యర్థులు చివరి క్షణంలో ఉరుకులు, పరుగులు పెట్టారు. ఏ పరీక్ష అయినా నిబంధనలు కఠినతరం చేస్తూ ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నా.. కొందరు అభ్యర్థుల్లో మాత్రం మార్పు రావడం లేదు. చివరి క్షణంలో ఉరుకులు పరుగులు తీస్తూ కనిపించారు. మరి కొందరు అభ్యర్థులు వారికి కేటాయించిన కేంద్రాలకు కాకుండా ఇతర సెంటర్లకు వెళ్లారు. ఆ తర్వాత అసలు విషయం తెలుసుకుని తమ కేంద్రాలకు రావడానికి నానా తంటాలు పడ్డారు. నగరంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థలకు ఒకే పేరుతో బ్రాంచ్‌లు ఉండగా.. వాటిని తెలుసుకునేందుకు సైతం ఇబ్బంది పడ్డారు. ఇక యూనివర్సిటీ పీజీ కళాశాల, ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలల పరీక్ష కేంద్రాల్లోనూ కొందరు అయోమయానికి గురయ్యారు.



మహిళా డిగ్రీ కళాశాలలో పరిశీలిస్తున్న కలెక్టర్

పరీక్ష కేంద్రాల తనిఖీ..

నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఆర్జేసీ డిగ్రీ కళాశాల, క్రియేటివ్ హైస్కూల్, మౌంట్‌ఫోర్టు హైస్కూల్, సెయింట్ జోసెఫ్ హైస్కూల్, కృష్ణప్రసాద్ మెమోరియల్ స్కూల్, హార్వెస్ట్ స్కూల్, శ్రీ చైతన్య జూనియర్ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వి.పి.గౌతమ్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేశామని, పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టులపై 12న సమీక్ష

డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి



మాట్లాడుతున్న మల్లు భట్టి విక్రమార్క

మధిర: జిల్లాలో కొనసాగుతున్న సాగు నీటి ప్రాజెక్టుల పనులపై ఈనెల 12న జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మధిర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీళ్లు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన గత పాలకులు జిల్లాలో ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్ ప్రాజెక్టుల నిర్మాణ పనులను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. సాగు నీటి ప్రాజెక్టుల విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 12న సీతారామ సాగునీటి ప్రాజెక్టు, వైరా రిజర్వాయర్‌కు సాగర్ కాలువ అనుసంధానం, నాగార్జున సాగర్ ప్రాజెక్టు పరిధిలోని జోన్ 3 ద్వారా మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలకు సాగునీటి సరఫరా అంశాలపై సమీక్ష ఉంటుందని వివరించారు. సాగర్ ఎడమ కాలువ ద్వారా వైరా రిజర్వాయర్‌కు సాగునీటిని మళ్లించేందుకు ఎన్నికల కోడ్‌కు ముందే రూ.75 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు గుర్తు చేశారు. ఈ పనులపై కూడా సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఖమ్మంలో సమీక్ష చేపట్టిన మరుసటి రోజు 13వ తేదీన సాగునీటి ప్రాజెక్టుల పనులు, వాటి ప్రగతిని తెలుసుకునేందుకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి క్షేత్ర పర్యటన చేపడుతామని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు పరిధిలో దుమ్ముగూడెం నుంచి జూలూరుపాడు వరకు జరుగుతున్న పనులు, ఏన్కూర్ నుంచి వైరా రిజర్వాయర్‌కు నాగార్జునసాగర్ ఎడమ కాలువను లింక్ చేయడం, కల్లూరు మీదుగా మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు జోన్ 3 ద్వారా కృష్ణా జలాలను అందించడం వంటి పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులతో సమీక్షిస్తామని వివరించారు.

పైరవీలకు తావులేదు

- అక్రమ పద్ధతిలో పొందిన పెన్షన్లు రద్దు చేస్తాం
- రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి



తిరుమలాయపాలెం సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం : ప్రజా ప్రభుత్వంలో ఏ పార్టీ వారైనా ఎలాంటి పైరవీలకు తావులేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో అక్రమ పద్ధతిలో పొందిన పెన్షన్లపై విచారణ చేపట్టి రద్దు చేస్తామని, అర్హులైన వారికే మంజూరు చేస్తామని చెప్పారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంతో పాటు రమణా తండా, బీసురాజుపల్లి, వెదుళ్లచెర్వు, పిండిప్రోలు, తెట్టెలపాడు, కేశవాపురం, తిప్పారెడ్డిగూడెం, జల్లేపల్లి, హైదర్‌సాయిపేట, పాతర్లపాడు, గోల్‌తండా, చంద్రుతండా, దమ్మాయిగూడెం తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని కొన్నింటి పరిష్కారానికి వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల కష్ట ఫలితంగానే ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, రాబోయే మూడేళ్లలో పాలేరు నియోజకవర్గంలో అర్హులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు అందించే బాధ్యత తనదేనని చెప్పారు. రెవెన్యూ అధికారులు గ్రామాల్లో సభలు పెట్టి భూ సమస్యలు పరిష్కరించాలని ఆర్డీఓ గణేష్‌ను ఆదేశించారు. అన్ని గ్రామాల్లోనూ ప్రభుత్వ భూముల లెక్కలు తేల్చాలని సూచించారు. పరిష్కారం కానీ భూ సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇళ్ల పైనుంచి వెళ్లే హైటెన్షన్ లైన్లను రెండు నెలల్లో మార్చాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. వర్షాకాలం సాగుకు చివరి భూముల వరకు ఎస్సారెస్పీ ద్వారా నీళ్లు వచ్చేలా చూడాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్లు, సెంట్రల్ లైటింగ్, షాపింగ్ కాంప్లెక్స్‌లు, మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మంత్రిని కోరగా కొన్ని సమస్యల పరిష్కారానికి ఆయా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా చెరువులు నింపాలని పలువురు రైతులు కోరారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ పి.వి.రామకృష్ణ, ఎంపీడీఓ శేషాద్రి, విద్యుత్ డీఈ నాగేశ్వరరావు, ఏడీ రామకృష్ణ, ఏఈ రవికుమార్, ఇరిగేషన్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, డీఈ బాణాల రమేష్‌రెడ్డి, ఎంపీపీ బోడా మంగీలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, మాజీ ఎంపీపీ అశోక్, జడల నగేష్, గోళ్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మా డబ్బు మాకు ఇచ్చేయండి..

- గొర్రెల వాటాధనం వాపస్ కోసం దరఖాస్తుల వెల్లువ
- ఇప్పటివరకు 3,850 దరఖాస్తులు.. 975 మందికి చెల్లింపు



జీవాలను మేతకు తరలిస్తున్న పెంపకందారులు (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: గొర్రెల పథకం కోసం చెల్లించిన వాటాధనాన్ని లబ్ధిదారులు వెనక్కు తీసుకుంటున్నారు. జిల్లాలో రెండో విడత పథకం కోసం 10,061 మంది లబ్ధిదారులు ఏడాది క్రితం వాటా ధనం చెల్లించారు. 21 గొర్రెలు ఉండే ఒక్కో యూనిట్ ధర రూ.1.75 లక్షలుగా నిర్ణయించగా సభ్యులు రూ.43,750 చొప్పున రూ.44.01 కోట్లు ప్రభుత్వానికి జమ చేశారు. కాగా, 2017లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొర్రెల పథకాన్ని రూపొందించి జిల్లాలో 32 వేల మందికి రెండు విడతల్లో అమలు చేయాలని నిర్ణయించింది. అయితే, మొదట విడతలో సుమారు 16 వేల మంది లబ్ధిదారులకు యూనిట్లు అందజేశారు. ఆపై రెండో విడత లబ్ధిదారులు వాటాధనం చెల్లించినప్పటికీ బీఆర్‌ఎస్ అధికారాన్ని కోల్పోవడంతో పథకం అమలు నిలిచిపోయింది. అంతేకాక కొత్తగా వచ్చిన కాంగ్రెస్ సైతం పథకం అమలుపై స్పష్టత ఇవ్వడం లేదు.

దరఖాస్తుల వెల్లువ

కొందరు లబ్ధిదారులు ఆభరణాలు తాకట్టు పెట్టి, ఇంకొందరు అప్పు చేసి మరీ వాటా ధనం చెల్లించారు. కానీ యూనిట్లు అందకపోగా, వడ్డీ భారం పెరుగుతుండడానికి తోడు మొదటి విడత పథకం అమలులో అవినీతి జరిగిందని 'కాగ్' విచారణలో బయటపడింది. జిల్లాలో కూడా అక్రమాలు జరిగినట్లు వెల్లడైంది. ఇంతలోనే రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం గొర్రెల పథకం అమలుపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో లబ్ధిదారుల్లో ఆశలు సన్నగిల్లాయి. ఈమేరకు వాటాధనం తిరిగి చెల్లించాలని జిల్లా పశుసంవర్ధక, పశువైద్య శాఖకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇప్పటివరకు మొత్తం 3,850 మంది దరఖాస్తు చేసుకోగా.. మార్చిలో దరఖాస్తులు ఇచ్చిన 975 మందికి వాటాధనం తిరిగి చెల్లించారు. ఏప్రిల్, మే నెలల్లో దరఖాస్తు చేసుకున్న వారికి చెల్లించే ప్రక్రియ కొనసాగుతోందని జిల్లా పశుసంవర్ధక, పశువైద్యాధికారి డాక్టర్ కే.వీ.నారాయణ తెలిపారు. కాగా, దరఖాస్తుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశముందని తెలుస్తోంది.

ముగిసిన సుదీర్ఘ గాన లహరి

- 32 గంటల కార్యక్రమానికి గుర్తింపుగా రికార్డు అందజేత
- గాయకులను ప్రశంసించిన ప్రముఖులు



మాలతీ నాయుడుకు రికార్డు అందిస్తున్న న్యాయ నిర్ణేతలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో 32 గంటల పాటు నిర్వహించిన గాన లహరి కార్యక్రమం విజయవంతమైంది. స్వర మధురిమ ఖమ్మం కల్చరల్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సుదీర్ఘ గాన లహరి ఆదివారం రాత్రి 8 గంటలకు ముగిసింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన 32 మంది గాయనీ, గాయకులు తెలుగు, హిందీ చిత్రాలకు చెందిన మధుర గీతాలను ఆలపించారు. గతేడాది 30 గంటల పాటు నిర్వహించిన జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను 32 గంటల సుదీర్ఘ గాన లహరి అధిగమించి ఇంటర్నేషనల్ వండర్‌ఫుల్ ఆఫ్ రికార్డ్స్‌ను సాధించింది. సాయిశ్రీ డెవలపర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ సౌజన్యంతో 32 గంటల పాటు నిర్విరామంగా కార్యక్రమాన్ని నిర్వహించిన స్వర మధురిమ కల్చరల్ యూనిట్‌ను పలువురు ప్రముఖులు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు అభినందించారు. కల్చరల్ యూనిట్ అధ్యక్షుడు ఇసనపల్లి నగేష్ ఆధ్వర్యంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో నిర్వాహకులు పంజా మాలతీ నాయుడును ఘనంగా సత్కరించి అవార్డు అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆదాయ పన్నుశాఖ కమిషనర్ లావుడ్యా జీవన్‌లాల్ హాజరై మాట్లాడారు. గాన లహరి వంటి కార్యక్రమాలు ఆహ్లాదాన్ని ఇస్తాయని అన్నారు. 32 గంటల పాటు గాన లహరి నిర్వహించటం అభినందనీయమని, కళా రంగానికి స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు నాగబత్తిని రవి మాట్లాడుతూ.. ఖమ్మం కళా గుమ్మంలో సుదీర్ఘ గాన లహరి కార్యక్రమం నిర్వహించటం మరుపురానిదని కొనియాడారు. న్యాయ నిర్ణేతలుగా జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా కో–ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కో - ఆర్డినేటర్ డాక్టర్ నాగశ్రీ, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జిల్లా కో -ఆర్డినేటర్ యడ్ల శ్రీనివాస్‌రావు వ్యవహరించారు. సాయిశ్రీ డెవలపర్స్ ఎండీ కమర్తపు శ్రీధర్, సీనియర్ గాయకులు వీవీ రెడ్డి, శ్రీహరి, దేవేందర్ గౌడ్, అశోక్, ఏఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కూలీల చెంతకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు



ఆటోలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల బాక్స్‌లను లోడ్ చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసే కూలీలు డీహైడ్రేషన్‌కు గురి కాకుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను మండలాలకు సరఫరా చేశారు. ఈ నెల 8న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు జిల్లా కార్యాలయంలో ఓ గదిలో మూలన పడేసిన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ఆదివారం మండలాలకు పంపించారు. ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అదనంగా లక్ష ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను కూలీల కోసం ఏర్పాటు చేయగా డీఆర్‌డీఏ అధికారులు కూలీలకు పంచకుండా కార్యాలయంలోనే నిల్వ చేశారు.

మోడల్ టెస్టుకు స్పందన



పరీక్ష పేపర్లను ఆవిష్కరిస్తున్న ఐలు బాధ్యులు

కొత్తగూడెంటౌన్: జూనియర్ సివిల్ జడ్జి పోటీ పరీక్షలపై అవగాహన కల్పించేందుకు జిల్లా కోర్టులో మోడల్ టెస్ట్ ఆదివారం నిర్వహించగా స్పందన లభించింది. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ హాల్లో నిర్వహించిన మోడల్ టెస్ట్‌కు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో న్యాయవాదులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఐలు జిల్లా కార్యదర్శి రమేశ్‌కు మార్‌మక్కడ్ మాట్లాడుతూ.. పోటీ పరీక్షపై అవగాహన కల్పించేందుకు ఈ మోడల్ టెస్ట్ నిర్వహించామన్నారు. అనంతరం మోడల్ టెస్టులో ప్రథమ స్థానం సాధించిన కాటూరి బిందును అభినందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ క్రీడా సాంస్కృతిక కార్యదర్శి దూదిపాల రవికుమార్, మహిళా ప్రతినిధి నల్లమల్ల ప్రతిభతోపాటు పుల్లయ్య, తెల్లబోయిన రమేశ్, పసువులేటి శ్రీనివాస్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కారును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

ఇల్లెందు : ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం ఆయన పూలదండ కొనుక్కొని వెళ్తుండగా.. అదే సమయంలో కొత్తగూడెం నుంచి వస్తున్న బస్సు కారు డోర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారు స్వల్పంగా దెబ్బతినడం మినహా ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

పేకాట స్థావరంపై దాడి

అన్నపురెడ్డిపల్లి: పేకాటస్థావరంపై దాడి చేసిన పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్న ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని కొండాయిగూడెం గ్రామశివారు మామిడి తోటలో పేటాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒక ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్, రూ.12,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిలిచిన డయాలసిస్ సేవలు


విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమా?



వైద్యశాలలోని డయాలసిస్ సెంటర్

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో అకస్మాత్తుగా డయాలసిస్ సేవలు నిలిచిపోయాయి. రెండు రోజులుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావటం.. వర్షం, గాలి దుమారం వల్ల విద్యుత్‌లో అంతరాయం ఏర్పడటంతో డయాలసిస్ యంత్రాలు పనిచేయడం లేదు. వాటికి విద్యుత్ సరఫరా కావడంలేదు. ఆదివారం ఇక్కడి పేషంట్లను మహబూబాబాద్ వైద్యశాలకు తరలించారు. డయాలసిస్ సెంటర్‌లో ఐదు మిషన్లు ఉన్నాయి. ఈ ఐదు మిషన్లలో నాలుగింటికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. యూపీఎస్‌కు విద్యుత్ సరఫరా అవుతున్నా మిషన్లు ఆన్ కావటం లేదు. టెక్నీషియన్‌కు సమాచారం అందించినప్పటికీ ఆదివారం సాయంత్రం వరకూ అందుబాటులోకి రాలేదు. సోమవారం కూడా డయాలసిస్ రోగులను మరో ప్రాంతానికి తరలించాల్సి రావొచ్చని హైరానా పడుతున్నారు. వారం రోజులుగా మబ్బులు కమ్ముకుని, గాలిదుమారం, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండటంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి ఉంటుందని, అందుకే మిషన్లు ఆన్ కావటం లేదని భావిస్తున్నారు. ఈ విసయమై వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్‌ను వివరణ కోరగా.. పిడుగుపాటు వల్ల విద్యుత్ సరఫరాలో తలెత్తిన లోపాల కారణంగా మిషన్లు ఆన్ కావటం లేదని, రోగులను మహబూబాబాద్ తరలించామని చెప్పారు. టెక్నీషియన్ వచ్చి పరిశీలిస్తే తప్ప లోపం ఏమిటో చెప్పలేమని తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,438

అన్నీ ఆలస్యమే..



రెండో బ్రిడ్జిపై అసంపూర్తిగా ఉన్న ఫుట్‌పాత్ పనులు

రెండో బ్రిడ్జి నిర్మాణానికి తొమ్మిదేళ్లు

- సారపాక రైల్వే లైన్ మాటే లేదు
- రామాలయంలో అభివృద్ధి పనులూ అంతంతే
- భద్రాచలంపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి వారికి దేశవ్యాప్తంగా అయోధ్యలో ప్రత్యేక గుర్తింపు ఉండగా, ఆ తర్వాత స్థానం దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలానికే దక్కుతుంది. రాముడు నడయాడిన క్షేత్రం ఆనవాళ్లు, నాలుగు చేతుల్లో నాలుగు ఆయుధాలతో సరాసరి వైకుంఠం నుంచి భద్రగిరిపై వెలిశాడనే చరిత్ర ఒక వైపు, అత్యధిక అటవీ ప్రాంతం గల ఏజెన్సీలో పచ్చని అడవులు, గోదావరి అందాలు, పాపికొండల సౌందర్యం, సహజ సిద్ధంగా ఏర్పడిన జలపాతాలు, అమాయక గిరిజనుల కట్టుబాట్లు, సంస్కృతీ సంప్రదాయాలు వంటివి మరో వైపు ఇక్కడ కనిపిస్తుంటాయి. ఇంతటి ప్రాముఖ్యత గల భద్రాచలాన్ని ఇటు ఆధ్యాత్మిక క్షేత్రంగా, అటు టూరిజం హబ్‌గా మార్చే అవకాశం ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలసత్వం వహిస్తున్నాయి. ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపితే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే అవకాశం ఉంది. కానీ కేంద్రం ఇప్పటివరకు భద్రాచలంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ నత్తనడకనే సాగుతున్నాయి. మరికొన్ని పనులు ప్రతిపాదనలకే పరిమితం అవుతున్నాయి.

రెండో బ్రిడ్జి ప్రారంభానికి తొమ్మిదేళ్లు..

భద్రాచలంలో గోదావరి నదిపై ఉన్న మొదటి బ్రిడ్జి పక్కనే రెండో బ్రిడ్జి నిర్మాణానికి 2015 ఏప్రిల్ 1న నాటి కేంద్ర జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ అప్పటి రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. 36 పిల్లర్లు, 12 మీటర్ల వెడల్పు, ఇరువైపులా నాలుగు అడుగుల ఫుట్‌పాత్‌తో 2016 నాటికే పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. గడువు లోగా పనులు పూర్తి కాకపోవడంతో 2019 వరకు, ఆ తర్వాత 2021 వరకు పొడిగించినా పనులు నత్తనడకన సాగాయి. ఇలా పలుమార్లు గడువు పొడిగిస్తూ వచ్చారు. నిర్మాణ సంస్థను పలుమార్లు హెచ్చరించినా పనులు ఏమాత్రం ముందుకు సాగలేదు. కాంట్రాక్టర్లు, అధికారులపై మంత్రులు పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేసినా ఫలితం శూన్యం. చివరకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జాతీయ రహదారుల అధికారులకు అల్టిమేటం జారీ చేసి చీవాట్లు పెట్టారు. దీంతో ఆగమేఘాల మీద రెండు వైపులా అప్రోచ్ రోడ్లను పూర్తి చేసి ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన శ్రీరామనవమి రోజున రెండో బ్రిడ్జిని లాంఛనంగా ప్రారంభించారు. ప్రస్తుతం వాహనాల రాకపోకలు సాగుతున్నా ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్ గోడ పనులు మాత్రం పూర్తి కాకపోవడం గమనార్హం. బడ్జెట్ అందుబాటులో ఉన్నప్పటికీ.. జాతీయ రహదారుల శాఖకు చెందిన రెండో బ్రిడ్జి నిర్మాణానికి తొమ్మిదేళ్లు పట్టింది.

'ప్రసాద్', విలీన గ్రామాల సమస్యా అంతంతే..

కేంద్ర ప్రభుత్వం, టూరిజం శాఖల ఆధ్వర్యంలో భద్రాచలం, పర్ణశాలలో చేపట్టే ప్రసాద్ పథకం పనులకు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము శంకుస్థాపన చేశారు. కానీ ఈ పనులు సైతం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. ఏడాది అయినా ఇంకా పునాది దశలోనే ఉన్నాయి. ఇక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల విభజన సమయంలో భద్రాచలం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పిచుకలపాడు, యటపాక, పురుషోత్తపట్నం, గుండాల, కన్నాయిగూడెం గ్రామాలను ఏపీలో కలిపారు. భద్రాచలంలో అంతర్భాగంగా ఉన్న ఆ ఐదు గ్రామాల విలీనంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. భద్రాచలం అభివృద్ధికి ఈ ఐదు గ్రామాలు కీలకం కావడం, ఆయా గ్రామాల వారు భౌగోళికంగా ఏపీలో ఉండేందుకు ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా తెలంగాణలో విలీనం చేయాలని ఎప్పటి నుంచో కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అయినా కేంద్రం నుంచి ఇంతవరకు స్పందన లేదు. ఇలా భద్రాచల సమస్యలను పట్టించుకోవడం, అభివృద్ధి పనులు చేపట్టడంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా అలసత్వం వీడాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదన దశలోనే రైల్వే లైన్..

దేశవ్యాప్తంగా పేరుగాంచిన భద్రాచలానికి రోడ్డు మార్గమే తప్ప రైల్వే సౌకర్యం లేదు. ఈ క్షేత్రానికి 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తగూడెంలో రైల్వే స్టేషన్ ఉంది. సుదూర ప్రాంతాల నుంచి రైలు ద్వారా రావాలంటే కొత్తగూడెంలో దిగి అక్కడి నుంచి రోడ్డు మార్గంలో చేరుకోవాల్సి ఉంటుంది. గతంలో కొత్తగూడెం - మణుగూరు మధ్యలో క్రిష్ణసాగర్ గ్రామ సమీపంలోని పాండురంగాపురం రైల్వే స్టేషన్ వద్ద స్టాప్ ఉండేది. అక్కడి నుంచి భద్రాచలం వరకు ప్రత్యేక బస్సులు నడిపేవారు. అయితే దానికి అంతగా ఆదరణ లేకపోవడంతో బస్సులను ఆపేశారు. దీనికి ముందు, ఆ తర్వాత పాండురంగాపురం నుంచి సారపాక వరకు 14 కి.మీ. మేర రైల్వే లైన్ పొడిగించాలని డిమాండ్ వచ్చింది. దీంతో రైల్వే లైన్ పొడిగింపునకు కేంద్రం రూ.47.50 కోట్ల బడ్జెట్‌ను ఎప్పుడో కేటాయించినా నేటికీ విడుదల చేయలేదు. దీంతో ఆ ప్రతిపాదన, బడ్జెట్ కాగితాలకే పరిమితమయ్యాయి. భద్రాచలానికి నేరుగా రైల్వే లైన్ వేసే అవకాశం ఉన్నా కేంద్ర ప్రభుత్వం దశాబ్దాలుగా నిర్లక్ష్యం వహిస్తోందని భక్తులు ఆవేదన చెందుతున్నారు. ఇక మలకన్‌గిరి నుంచి భద్రాచలం వరకు ప్రతిపాదించిన రైల్వేలైన్ సైతం ప్రస్తుతానికి ఒడిశాలోనే ఆగిపోయింది.

నిలిచిన ఆర్టీసీ బస్సు..

ప్రయాణికుల ఇక్కట్లు



ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి బస్టాండ్ నుంచి బయలుదేరిన బస్సు స్థానిక జేవీఆర్ డిగ్రీ కళాశాల వరకు వెళ్లేసరికి ఆగిపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. సత్తుపల్లి నుంచి ఖమ్మం వెళ్తున్న బస్సు గేర్లు పని చేయకపోవటంతో డ్రైవర్ బస్సును నిలిపివేశారు. బస్సు కండీషన్ చూసుకోకుండా ఎలా తిప్పుతున్నారంటూ సిబ్బందిపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సుకు మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నందున బస్సు కదలదని డ్రైవర్ చెప్పటంతో ప్రయాణికులు మరో బస్సు ఎక్కాల్సి వచ్చింది.

కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ



కుళ్లి పాడైపోయిన గుడ్లు

కామేపల్లి: చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషక లోపాలు అధిగమించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తోంది. వీటిలో నాణ్యత లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కామేపల్లి మండలం ఊట్కూర్ అంగన్‌వాడీ కేంద్రంలో కుళ్లిన కోడిగుడ్లను పంపిణీ చేస్తున్నారు. కేంద్రానికి ఇటీవల కాంట్రాక్టర్ సరఫరా చేసిన కోడిగుడ్లను అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు అందజేశారు. వారు ఇంటికి తీసుకెళ్లి పరిశీలించగా అవి కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఊట్కూర్ గ్రామానికి చెందిన గర్భిణి చింతల సుమతికి శనివారం స్థానిక అంగన్‌వాడీ టీచర్ మూడు గుడ్లను పంపిణీ చేసింది. ఆదివారం గుడ్లను పగలగొట్టి చూడగా అవి కుళ్లి పోయి దుర్వాసన వస్తుండటంతో పడేసింది.

నిశ్చితార్థం కోసం వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

ఐదుగురికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన మహిళలు

బోనకల్: నిశ్చితార్థం కోసం ఓ కుటుంబం కారులో వెళ్తుండగా ప్రమాదం జరగడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. ఏపీలోని పల్నాడు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన కంద్రాతి శశికుమార్.. తన కుటుంబ సభ్యులు కంద్రాతి పద్మావతి, పిన్ని భాగ్యలక్ష్మి, వదిన ఓరుగంటి అంజలి, బావమరిది ఓరుగంటి శంకర్‌తో కలిసి కారులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో నిశ్చితార్థం కోసం శనివారం తెల్లవారుజామున బోనకల్ మీదుగా వెళ్తున్నారు. వైరా మండలం వల్లాపురం గ్రామానికి చెందిన ఎర్రగాని వీరయ్య తన మోటార్ సైకిల్‌పై పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. సీతానగరం గ్రామ సమీపంలోకి రాగానే వెనుక నుంచి వస్తున్న కారు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టి అదుపుతప్పి పక్కనే గల చెట్టును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న డ్రైవర్‌తో సహా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పద్మావతి, భాగ్యలక్ష్మిని 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శశికుమార్, అంజలి, శంకర్‌ను వైరా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ అతి వేగం నిద్ర మత్తు కారణంగానే ప్రమాదం జరిగి ఉండొచ్చని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

చింతకాని: మండలంలోని లచ్చగూడెం గ్రామ సమీపంలో ఆదివారం ఆటో బోల్తా పడి చింతకాని గ్రామానికి చెందిన మొగిలి లక్ష్మి (45) మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్మి తన అల్లుడు పుట్టబంతి వెంకటనారాయణతో కలిసి ఆటోలో గ్రామాలు తిరుగుతూ పుచ్చకాయలు విక్రయిస్తోంది. కాగా, పుచ్చకాయలు తెచ్చుకునేందుకు ఆటోలో చింతకాని నుంచి ఖమ్మం వెళ్తుండగా లచ్చగూడెం గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. లక్ష్మి తలకు తీవ్ర గాయం కావటంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

అశ్వాపురం: రైలు ఢీకొని తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. మండలంలోని గొందిగూడెం గ్రామానికి చెందిన సున్నం సీతారాములు (60) మేకలు తోలుకుని వస్తూ రైలు పట్టాలు దాటుతుండగా కొత్తగూడెం నుంచి మణుగూరు వస్తున్న గూడ్స్ రైలు ఢీకొట్టింది. సీతారాములుకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కొత్తగూడెం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మాజీ సర్పంచ్ పాయం భద్రమ్మ, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు.

ద్విచక్రవాహనం చోరీ

అశ్వారావుపేటరూరల్: ద్విచక్రవాహనం చోరీకి గురైన ఘటనపై ఆదివారం స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ యాకూబ్‌అలీ కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా లింగపాలెం మండలం రాచన్నగూడేనికి చెందిన బండారు శ్రీనివాసరావు అశ్వారావుపేటలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఓ వస్త్ర దుకాణం సమీపంలో తన ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేశారు. అనంతరం వస్త్ర దుకాణంలోకి వెళ్లి, తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. బాధితుడు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ



తండ్రికి తల కొరివి పెడుతున్న చిన్నారి

ఇల్లెందు: పట్టణంలోని 3వ వార్డు ఎల్‌బీఎస్‌నగర్‌కు చెందిన కటకం రాజేశ్ (35) అనారోగ్యంతో మృతి చెందగా పదేళ్ల తన కుమార్తె తలకొరివి పెట్టింది. ఆదివారం పాత ఇల్లెందులో ఈ ఘటన చోటుచేసుకుంది. రాజేశ్ తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, కళావతి రెండు నెలల వ్యవధిలో మృతిచెందడంతో ఆయన తీవ్రంగా మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు రాజేశ్‌ను ఖమ్మానికి తరలించారు. శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, పదేళ్ల కుమార్తె ఉన్నారు. ఒకే ఇంట్లో ముగ్గురు మృతిచెందటంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.


రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న లారీ

తల్లాడ: అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్, తల్లాడ పోలీసులు తల్లాడలో ఆదివారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఎస్‌ఐ కొండల్‌రావు కథనం ప్రకారం.. ఖమ్మం నుంచి కాకినాడ రంగంపేటకు లారీలో 250 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని లోడ్ చేసుకొని, పైన టార్పాలిన్‌లు కప్పుకొని తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. లారీడ్రైవర్ రాంమోహన్‌ను అదుపులోకి తీసుకొని రేషన్ బియ్యాన్ని, లారీని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. జగ్గయ్యపేటకు చెందిన లారీ యజమాని కిశోర్‌ను విచారిస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం



దగ్ధమైన లారీ

అశ్వాపురం: మండలంలోని కుర్వపల్లి కొత్తూరు గ్రామంలో ఓ లారీ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. తుమ్మలచెరువు నుంచి మట్టితో మొండికుంట వైపు వస్తున్న లారీ ఆదివారం తెల్లవారుజామున కుర్వపల్లి కొత్తూరు వద్దకు రాగానే వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు లేచాయి. స్థానికులు ఫైర్ సిబ్బంది సాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాక లారీ పూర్తిగా దగ్ధమైంది.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'ప్రైవేట్' సత్తా..

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఖమ్మంలోని ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆలిండియా స్థాయి ర్యాంకులు సాధించి సత్తాచాటారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయా యాజమాన్యాలు ఆదివారం అభినందించాయి. – ఖమ్మంసహకారనగర్

శ్రీచైతన్య ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న 'శ్రీచైతన్య' యాజమాన్యం

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యా సంస్థలకు చెందిన డి.శైలజ 2వ ర్యాంక్, బి.రామచరణ్ 31, బి.వెంకటమణిరామ్ 45, వి.సందీప్ 74, బి.అభిలాష్ 101, ఎస్.సాత్విక్ 115, జి.శివసాయి 119, పి.సాయిదినేశ్‌రెడ్డి 138, బి.రామ్‌చరణ్‌తేజ 167, టి.శ్రీనివాస్ 179, జె.సింధు 241, వి.తుషార్ 249, భి.రాఘవ 267, సీహెచ్.సంజయ్ 310, డి.శ్రీ సాత్విక్ 320, వి.సునీల్ కుమార్ 366, ఎం.అనిల్ 409, బి.కుషాంత్ 417, ఏ.నీరజ 448, జి.రిషిరాజ్ 497వ ర్యాంక్ సాధించారని చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. అభినందన కార్యక్రమంలో బి.సాయిగీతిక, చేతన్ మాదూర్, ఎన్‌ఆర్‌ఎస్‌డీ వర్మ, సీహెచ్.బ్రహ్మం, జి.ప్రకాష్, గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్ అవుతా

– డి.శైలజ, ఆలిండియా 2వ ర్యాంకర్



కష్టపడి చదువుకొని ఐఏఎస్ కావాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాను. ఐఏఎస్ అయితే సమాజానికి సేవ చేసే అవకాశం ఉంటుంది. మా తల్లిదండ్రులు నా ఇష్టాన్ని గుర్తించి నేను చదువుతానంటే నాపై నమ్మకంతో శ్రద్ధగా చదివించారు. నేను శ్రీచైతన్య కళాశాలను ఎంపిక చేసుకుంటే వారు అదే కళాశాలలో చేర్పించారు. మల్లెంపాటి శ్రీధర్, శ్రీవిద్య, లెక్చరర్ల ప్రోత్సాహంతో 2వ ర్యాంక్ సాధించగలిగాను.

కృష్ణవేణి విజయదుందుభి



విద్యార్థులను అభినందిస్తున్న 'కృష్ణవేణి' డైరెక్టర్లు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో బి.నితిన్ 714వ ర్యాంక్, బి.సాయికిరణ్ 885, పి.రోహిత్‌కుమార్ 961, బి.చరణ్ 1,029, ఎం.మోహిత్‌నాయక్ 1,279, బి.అఖిల్ 1,338, ఎస్.ప్రియదర్శిని 2,574, జి.కార్తీక్ 2,630, ఎం.ఆనంద్‌కుమార్ 2782, ఎం.శశాంక్ 3,265, ఎం.జీవని 4,851, ఎం.ఉజ్వలమానస 6,600, పి.నవదీప్ 6,607వ ర్యాంక్‌లు సాధించారని కృష్ణవేణి జూనియర్ కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి జగదీశ్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రిన్సిపాల్ గుర్రం రామచంద్రయ్య, వంశీకృష్ణ, ఏఓ నిరంజన్‌కుమార్ అభినందించారు.

న్యూవిజన్ విజయం

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరిలో కె.వర్షిత 644వ ర్యాంక్, జి.మహాస్వీ 760, వివిధ కేటగిరిల్లో బి.ప్రభంజన్‌జాదవ్ 12, కె.వర్షిత 58, ఎం.నితీశ్‌కుమార్ 79, డి.మురళీకృష్ణ 97, వి.రిషిత్‌పవార్ 102, జి.మహాస్వీ 111, జి.శ్రీరామ్ 210, సీహెచ్ భావన 294, ఎం.జేతహర్షిణి 297, జి.లోకేశ్ 341, పి.రేవంత్ 382, వి.దివ్య శ్రీ 386, కె.పుష్పక్ శివసాయి 429, ఎం.నిమిత 519, బి.హరిచందన 540, జి.వాత్సల్య సేన 548, వి.మురహరీశ్ 646, డి.ప్రదీప్ 677, ఎస్.రుషిధర్‌రెడ్డి 726, ఎండీ రిడాన్‌మీన్ 749, ఆర్.ప్రణీశ్ 756, బి.ప్రీతి 851, బి.భానుశంకర్ 889, జె.విగ్నేశ్ 947వ ర్యాంక్ సాధించారని న్యూవిజన్ విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్‌జీకే ప్రసాద్ తెలిపారు. అభినందించిన వారిలో డైరెక్టర్ గోపిచంద్, కార్తీక్, బ్రహ్మచారి, శ్రీనివాసరావు ఉన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న 'న్యూవిజన్' యాజమాన్యం

రెజొనెన్స్ ప్రభంజనం

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో రెజొనెన్స్ కళాశాల విద్యార్థులు ఆలిండియా స్థాయిలో ఎ.దినేశ్ 288వ ర్యాంక్, జీవన్‌కుమార్ 364, ఎల్.ప్రవీణ్ 729, డి.లోకేశ్ 942, కేశవకుమార్ 1,186, బి.జగదీశ్ 1,533, ఎం.సిద్ధార్థధొర 1,984, ఎం.లోహిత్ 2,521, కె.అవినాష్ 3,288, జి.రాజశ్రీ 7,073వ ర్యాంక్ సాధించారని డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, కె.శ్రీధర్‌రావు తెలిపారు. అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సతీశ్, భాస్కర్‌రెడ్డి, శాంతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న 'రెజొనెన్స్' యాజమాన్యం

హార్వెస్ట్‌కు ఉత్తమ ర్యాంకులు

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో వి.జశ్వంత్ 94వ ర్యాంక్, ఎ.గోపిచంద్ 161, కె.మనోహర్ చౌహాన్ 337, డి.సంతోష్ 433, ఎన్.తపస్వీ 873, బి.శరణ్‌మేఘ 878, బి.హైందవిరాథోడ్ 888, టి.స్పందన 1,238, బి.పావని లక్ష్మీ 1,244, ఏ.జిష్ణుకృష్ణప్రసాద్ 2,876, జి.రాజ్‌వర్ధన్ 4,589, ఎం.లోకేశ్‌సాయి 4,024, ఎస్.అనిష్ 8,180, వి.సత్యతథాగత్ 14,873, ఆర్.సాయిసంజయ్ 16,040, టి.అభినవ్ 16,963వ ర్యాంక్ సాధించారని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న 'హార్వెస్ట్' యాజమాన్యం

వెలాసిటీ విజయకేతనం



టి.వినీత్‌కుమార్

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో వెలాసిటీ కళాశాల అకాడమిక్ డీన్ మహ్మద్ యాకూబ్, చైర్మన్ శెట్టి లక్ష్మణ్‌రావు, సెక్రటరీ, కరస్పాండెంట్ మల్లోలు రవి తెలిపారు. ఆలిండియా స్థాయిలో టి.వినిత్ కుమార్ 956వ ర్యాంక్ సాధించారన్నారు. కార్యక్రమంలో శ్యామ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చింపాంజి వేషంతో కోతులకు చెక్..



చంద్రుగొండ: మండలంలోని రావికంపాడు గ్రామంలో కోతుల సమస్యకు తాత్కాలికంగా చెక్ పెట్టారు. పంచాయతీ ఆధ్వర్యంలో చింపాంజి వేషధారణలో కోతులను అటవీ ప్రాంతంలోకి వెళ్లగొడుతున్నారు. ఆ గ్రామంలో వందల సంఖ్యలో ఉన్న కోతుల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలోకి దూరి పండ్లు, కూరగాయలు, ఇతర పదార్థాలు ఎత్తుకెళ్తున్నాయి. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. కోతుల దాడులతో పదుల సంఖ్యలో క్షతగాత్రులవుతున్నారు. సమస్య జఠిలంగా మారడంతో గ్రామస్తుల కోరిక మేరకు పంచాయతీ ఆధ్వర్యంలో చింపాంజి డ్రెస్ తీసుకొచ్చారు. సిబ్బందిలో ఒకరు చింపాంజి డ్రెస్ ధరించి కోతులను బెదరకొడ్తున్నారు.

క్లుప్తంగా...

ములుగు జిల్లాలో నాలుగు మందుపాతరల గుర్తింపు

- అప్పటికే పేలిపోయిన 3 ఐఈడీలు
- జంతు కళేబరాలు లభ్యం


పోలీసులు గుర్తించిన మందు పాతర

వెంకటాపురం.కె (ములుగు): తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని ములుగు జిల్లా వెంకటాపురం మండలం వీరభద్రవరం అటవీ ప్రాంతంలో పోలీసులు నాలుగు మందు పాతర (ఐఈడీ)లను గుర్తించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ శబరీష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో కొద్ది రోజులుగా పోలీసులు, బాంబ్ స్క్వాడ్ బృందాలు మావోయిస్టులు అమర్చిన మందు పాతరలను గుర్తించడానికి తనిఖీలు చేస్తుండగా ఈ నాలుగు మందుపాతరలను గుర్తించినట్లు వెల్లడించారు. వాటిలో మూడు పేలిపోయి ఉన్నాయని, సమీపంలో ముళ్లపంది, కొండెంగ, ఒక పెంపుడు కుక్క కళేబరాలను గుర్తించామని, మిగిలిన మందుపాతరను బాంబ్‌స్క్వాడ్ సహాయంతో నిర్వీర్యం చేసినట్లు తెలిపారు.

ఏటీఆర్, ఎన్‌ఎస్‌టీఆర్‌లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు

ఏపీ,తెలంగాణ సంయుక్త సమావేశంలో వివిధ అంశాలపై చర్చ

సాక్షి, హైదరాబాద్: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్), నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ (ఎన్‌ఎస్‌టీఆర్)లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధాన్ని కఠినతరంగా అమలు చేస్తామని తెలంగాణ పీసీసీఎఫ్ డోబ్రియాల్, ఆంధ్రప్రదేశ్ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి తెలిపారు. ఏ సమస్య తలెత్తినా రెండు రాష్ట్రాలు సుహృద్భావ వాతావరణంలో చర్చించి నిర్ణయాలు తీసుకుని ముందుకుపోవాలని నిర్ణయించామన్నారు. అమ్రాబాద్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో రెండు రాష్ట్రాల అధికారులు పాల్గొని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలుతో పాటు అడవులకు సంబంధించిన సరిహద్దు సమస్యలు, నివాస నిర్వహణ, రక్షణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ ప్రాంతంలో తీర్థయాత్రల సందర్భంగా భక్తుల తాకిడి పెరుగుతుండటంతో ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా ఉందని అధికారులు తెలిపారు. రెండు టైగర్ రిజర్వ్‌లలో ప్రత్యేకంగా తాగు నీటి కోసం ప్రత్యామ్నాయాన్ని అందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ఏపీ చీఫ్ వైల్డ్ వార్డెన్ ఏకే నాయక్, ఏటీఆర్, ఎన్‌ఎస్‌టీఆర్ అధికారులు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో హైటెక్స్‌లో వెడ్డింగ్ ప్లానర్ల సమ్మేళనం

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- హాజరుకానున్న దేశవిదేశాల వెడ్డింగ్ ప్లానర్లు, డిజైనర్లు



సనత్‌నగర్ (హైదరాబాద్): జాతీయ, అంతర్జాతీయ వెడ్డింగ్ ప్లానర్ల సమ్మేళనం హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ టూరిజం, తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ఆధ్వర్యంలో సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ 3వ ఎడిషన్, 3వ టీసీఈఐ ఎస్ఐడబ్ల్యూయూపీసీ గ్లోబల్ 2024 బియాండ్ ఇమాజినేషన్, 7వ టీసీఈఐ ఈవెంట్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ 2024 వేడుకలు జరగనున్నాయి. ఈ మేరకు ఆదివారం బేగంపేట పర్యాటక భవన్‌లోని ది ప్లాజా హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ, భారతీయ వివాహ పరిశ్రమలోని నిపుణులను ఇది ఒకచోట చేర్చుతుందని, ఈ ఈవెంట్ ద్వారా వివాహాలకు దక్షిణాది నుంచి ముఖ్యమైన సహకారం, పరిజ్ఞానం, ప్రత్యేక వేదికను అందించడమే లక్ష్యమన్నారు. భారతీయ వివాహ వ్యవస్థలోని వివిధ అంశాలపై జ్ఞానయుక్తమైన సెషన్లు ఉంటాయని, జాతీయ, అంతర్జాతీయ వక్తలు ఈ సమావేశానికి హాజరుకానున్నారని తెలిపారు. ఈ కన్వెన్షన్ కోసం దేశవిదేశాల్లో ఉన్న 20కి పైగా వెడ్డింగ్ ప్లానర్లు, వెడ్డింగ్ డిజైనర్లు, వెడ్డింగ్ స్టైలిస్టులు, డెకరేటర్లు, ఈవెంట్ మేనేజర్లు, ఈవెంట్ ఇండస్ట్రీలోని ఇతర క్రాఫ్ట్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయన్నారు. ఈవెంట్‌కు సిడ్నీ నుంచి వెండీ ఈఎల్ ఖౌరీ సహా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నిపుణులు హాజరవుతారన్నారు. టెడ్డీ ఇమాన్యుయేల్ (ఫిలిప్పీన్స్), మైఖేల్ రూయిజ్ (ఫిలిప్పీన్స్), బ్రయాన్ టాచీ-మెన్సన్ (ఘనా) తదితరులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఇతర ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం దేశవిదేశాల నుంచి 700 మందికి పైగా ప్రతినిధులకు స్వాగతం పలుకుతోందన్నారు. 'ఈవెంట్ బజార్'గా పిలవబడే ఎక్స్‌పోలో 60కి పైగా స్టాల్స్‌లో గ్రాండ్ డిస్‌ప్లే ఉంటుందన్నారు. ఈవెంట్ పరిశ్రమలో ఉన్న విభిన్న ఉత్పత్తులు, సేవలు, అత్యాధునిక ట్రెండ్లను ప్రదర్శిస్తుందని చెప్పారు. ప్యానెల్ చర్చలు, వర్క్‌షాప్‌లు, ఈవెంట్ సేఫ్టీ, టెక్నాలజీ పాత్ర తదితర కీలక అంశాలపై సమాంతర సెషన్లు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ డైరెక్టర్ రమేశ్‌నాయుడు, హైటెక్స్ హెడ్ టీజీ శ్రీకాంత్, టీసీఈఐ అధ్యక్షుడు ఆళ్ల బలరాంబాబు, ప్రధాన కార్యదర్శి రవిబురా, కోశాధికారి ఎండీ తౌఫిక్ ఖాన్, ఎస్ఐడబ్ల్యూయూపీసీ గ్లోబల్ 2024 కన్వీనర్ సాయి శ్రవణ్ మాదిరాజు, టీసీఈఐ ఈవెంట్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ 2024 కన్వీనర్ రామ్ ముప్పన, కో-కన్వీనర్లు హరీష్‌రెడ్డి, కుమార్‌రాజా, సుధాకర్ యారబడి, డాక్టర్ సౌరభ్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తాం

- 'ఆటా' బిజినెస్ సెమినార్‌లో మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన అట్లాంటాలో 'ఆటా' బిజినెస్ సెమినార్‌లో ఆదివారం ప్రసంగించారు. హైదరాబాద్ సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి వికేంద్రీకరణ కోసం కొత్త పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచానికి ఏఐ రాజధానిగా హైదరాబాద్‌ను రూపొందించే లక్ష్యంతో 200 ఎకరాలను ఏఐ పరిశ్రమల కోసం కేటాయించినట్లు తెలిపారు. సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగే గ్లోబల్ ఏఐ సమ్మిట్‌కు అమెరికాలో స్థిరపడ్డ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు రావాలని కోరారు.

'సైబర్' బాధితులకు రూ.7.9 కోట్లు అందజేత

- సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును ఇప్పించిన అధికారులు
- జాతీయ లోక్ అదాలత్‌లో 2,973 కేసులు పరిష్కారం
- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్ల చేతిలో డబ్బు పోగొట్టుకున్న బాధితులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు న్యాయం చేస్తున్నారు. ఈనెల 8న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఒక్క రోజులోనే రాష్ట్రవ్యాప్తంగా రూ.7.9 కోట్లు తిరిగి సైబర్ బాధితులకు ఇప్పించారు. బాధితులు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన సందర్భంలో వెంటనే సంబంధిత బ్యాంకు, సైబర్ సెక్యూరిటీ విభాగానికి చేసిన ఫిర్యాదుల ఆధారంగా నేరగాళ్లకు డబ్బులు వెళ్లకుండా ఫ్రీజ్ చేసి న్యాయ ప్రక్రియ ద్వారా అధికారులు బాధితులకు రీఫండ్ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ లీగల్ సర్వీసెస్ అథారిటీ, అన్ని జిల్లాల పోలీసు విభాగాలు, పోలీసు కమిషనరేట్ల అధికారుల సమన్వయంతో జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైనట్టు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీసీఎస్‌బీలో మొత్తం 4,144 కేసులు నమోదు కాగా, ఇందులో జూన్ 8న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 2,973 కేసులలో బాధితులకు రూ.7.9 కోట్లు సొమ్మును తిరిగి ఇప్పించగలిగినట్టు పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన లోక్ అదాలత్‌లోనూ 803 కేసులు పరిష్కరించగలిగినట్టు తెలిపారు. సైబర్‌నేరగాళ్ల చేతిలో మోసపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శిఖాగోయల్ సూచించారు. అపరిచిత వ్యక్తులు, నంబర్ల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లలోని లింక్‌లపై క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దని కోరారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్టు గుర్తిస్తే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న సొమ్మును తిరిగి కాపాడేందుకు అవకాశాలు ఎక్కువ ఉంటాయని శిఖాగోయల్ తెలిపారు.

విద్యుత్ స్తంభంపైనే ఆగిన ఊపిరి

- షాక్‌తో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ మృతి
- నాలుగు గంటలపాటు స్తంభంపైనే మృతదేహం



ఆదిలాబాద్ రూరల్: ఓ ఇంటికి విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తడంతో మరమ్మతులు చేసేందుకు కరెంట్ స్తంభం ఎక్కిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్.. దానిపైనే షాక్‌కు గురై మృతిచెందాడు. ఆదిలాబాద్ జిల్లా రాములుగూడలో ఈ ఘటన జరిగింది. ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని రాములుగూడ గ్రామానికి చెందిన దడంజే మోతీరాం (35) కొన్నేళ్లుగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఓ ఇంటికి విద్యుత్ సరఫరా లేకపోవడంతో మోతీరాంను పిలిచారు. ఆయన వచ్చి సరఫరాను పునరుద్ధరించేందుకు విద్యుత్ స్తంభం ఎక్కాడు. అయితే పైనుంచి వెళ్తున్న త్రీఫేజ్ విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కుగురై అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మోతీరాం మృతితో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనాస్థలికి చేరుకుని ఆందోళన చేశారు. తమకు పరిహారం చెల్లించే వరకు మృతదేహాన్ని కిందకు దింపొద్దని డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులు అక్కడికి రావడం ఆలస్యం కావడంతో మోతీరాం మృతదేహం స్తంభంపైనే నాలుగు గంటలపాటు ఉండిపోయింది. పోలీసులు, విద్యుత్ అధికారులు బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మోతీరాం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా మోతీరాం మృతికి.. తమకు ఎలాంటి సంబంధం లేదని మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతిరెడ్డి తెలిపారు. విద్యుత్ స్తంభంపైకి ఎక్కిన మోతీరాం తమ లైన్‌మన్, జూనియర్ లైన్‌మన్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు.

హైవేలు రక్తసిక్తం

జాతీయ రహదారులు 44, 65పై ఘోర రోడ్డు ప్రమాదాలు

ఐదుగురు దుర్మరణం.. ఆరుగురికి గాయాలు

ఆదివారం రాష్ట్రంలోని రెండు జాతీయ రహదారులు రక్తసిక్తమయ్యాయి. 44వ నంబర్ హైవేపై జరిగిన ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందగా, హైవే 65పై చోటుచేసుకున్న ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. రెండు ఘటనల్లో మొత్తం ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు.

పెబ్బేరు రూరల్: వారంతా జైనమత ప్రచార బోధకులు.. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కాలినడకన బయల్దేరిన వారిని డీసీఎం రూపంలో మృత్యువు వెంటాడింది. 44వ నంబర్ జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో ఓ సాధువుతోపాటు ఇద్దరు సహాయకులు దుర్మరణం చెందగా, మరో ఇద్దరు స్వామీజీలకు తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి వివరాల మేరకు.. గుజరాత్ రాష్ట్రానికి చెందిన జైనమత ప్రచార బోధకులు విజ్ఞాన్‌ప్రజ్ఞ మహరాజ్, పునీత్ మహరాజ్, ప్రియాంకర్ మహరాజ్, వీరికి తోడుగా సహాయకులు భగవాన్ బాయ్, హేమల్ ప్రవీణ్ షాతో పాటు మరికొందరు ఈనెల 3న హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కాలినడకన బయల్దేరారు. మార్గమధ్యలో పెబ్బేరు మండలం రంగాపురం పాఠశాలలో శనివారం రాత్రి బస చేశారు. ఆదివారం ఉదయం నడక ప్రారంభించారు. గ్రామ శివారులో స్వామీజీలు వీల్‌చైర్‌లో కూర్చోగా, సహాయకులు తోసుకుంటూ వెళ్తుండగా.. కర్నూలు వైపు వేగంగా వెళ్తున్న డీసీఎం వారిని ఢీకొట్టింది. ప్రమాదంలో భగవాన్ బాయ్ (36), హేమల్ ప్రవీణ్ షా (40)లకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. స్వామీజీలు విజ్ఞాన్‌ప్రజ్ఞ మహరాజ్, పునీత్ మహరాజ్, ప్రియాంకర్ మహరాజ్‌లకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హైవే అంబులెన్స్‌లో గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పునీత్ మహరాజ్ (45) మృతిచెందారు. మరో ఇద్దరు స్వామీజీలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

లారీల మధ్య ఇరుక్కుని నుజ్జునుజ్జయిన కారు..



సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): జాతీయ రహదారి 65పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది గ్రామ శివారులో ఆదివారం జరిగింది. సదాశివపేట సీఐ మహేశ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా దేవరిప్పరిగి తాలూకా ఉన్నాల్ వాసి హాజీ షబాజ్ తన భార్య సమ్రీన్ (45), ఇద్దరు కుమారులు జునైద్, అబ్దుల్లాలతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్లి పని చూసుకొని సొంతూరుకు వెళ్తున్నారు. నందికంది శివారు నాగ్సాన్‌పల్లి చౌరస్తా వద్ద యూటర్న్ తీసుకుంటున్నారు. వారి వెనకాలే హైదరాబాద్ నుంచి సదాశివపేట వైపు అతివేగంగా వస్తున్న ట్యాంకర్ లారీ డ్రైవర్ మృత్యుంజయ దుబే(45) కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. అదే సమయంలో ఇటుగా జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు మరో లారీ వెళ్తోంది. దీంతో కారు.. రెండు లారీల మధ్య ఇరుక్కుని నుజ్జయింది. ఈ ఘటనలో కారులో ఉన్న సమ్రిన్, ట్యాంకర్ డ్రైవర్ మృత్యుంజయ దుబే ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ప్రమాదంలో హాజీ షబాజ్‌కు, అతని ఇద్దరు కుమారులకు, లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. చనిపోయిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా వార్తలు

సీఎంతో ముఖాముఖికి మర్లపాడు విద్యార్థిని


సీఎంతో ముఖాముఖికి ఎంపికైన జయశ్రీ

మధిరరూరల్: పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాల సన్మానం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డితో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనుండగా.. మధిర మండలం మర్లపాడు విద్యార్థిని వడ్డెరపు జయశ్రీ ఎంపికైంది. ఈనెల 8 నుంచి 10 వరకు జరిగే ఈ కార్యక్రమంలో మొదటి రోజు పరిచయ కార్యక్రమం, 9న కెరీర్, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ తరగతులు, హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీ, అసెంబ్లీ, సచివాలయం, ట్యాంక్ బండ్, హైటెక్ సిటీ చూశారని, సోమవారం హరిహర కళాభవన్‌లో విద్యాదాతలు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేసిన వారికి అభినందన సభ ఉంటుందని మర్లపాడు హైస్కూల్ హెచ్‌ఎం భీరమరాజు తెలిపారు. ఆ తర్వాత రవీంద్రభారతిలో సీఎం చేతుల మీదుగా విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులను సన్మానిస్తారని, ముఖాముఖి ఉంటుందని వివరించారు. జయశ్రీతో పాటు ఆమె తండ్రి నాగార్జునకు, తనకు ఆహ్వానం అందిందని పేర్కొన్నారు.

ఈపీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి 18 నుంచి డ్రైవింగ్ టెస్ట్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో పనిచేస్తూ డ్రైవింగ్ హెవీ లైసెన్స్ ఉన్నవారికి ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లో ఖాళీలను బట్టి ఈపీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి డ్రైవింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు యాజమాన్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు ఆయా గనుల హెచ్‌ఓడీలకు సర్క్యులర్ కాపీలను అందజేసింది. సంస్థలో 68 ఖాళీలు ఉండగా, ఆయా ఏరియాల్లో అర్హులైన వారికి పరీక్షలు నిర్వహించి ప్రతిభ సాధించిన వారికి ఎంపిక చేస్తామని అధికారులు పేర్కొన్నారు. 100 మార్కులు గల ఈ పరీక్షలో డ్రైవింగ్ టెస్ట్‌కు 60, రాత పరీక్షకు 25, ఎసెస్‌మెంట్ రిపోర్ట్‌కు 15 మార్కులు కేటాయించినట్లు వివరించారు. ఎస్సెస్ మెంట్ రిపోర్ట్ ద్వారా కేటాయించనున్నారు. ఈనెల 18న డ్రైవింగ్, 30న రాత పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. కాగా, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ఏరియాలకు సంబంధించి 158 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరికి కొత్తగూడెంలోని ప్రొఫెసర్ జయశంకర్ మైదానంలో డ్రైవింగ్ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

ఉత్పత్తి ఉత్తుత్తిదే..


లైనింగ్ లేకపోవటంతో నీళ్లు నిలవని పాండ్


శిథిలావస్థలో ఉన్న మత్స్య విత్తన కేంద్రం కార్యాలయం


అరకొర పరికరాలతో హేచరీస్ గది

- వైరాలో 45 ఏళ్ల కిందట చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు
- కనీస సౌకర్యాలు లేక నానాటికీ తగ్గుతున్న సామర్థ్యం
- ఇక్కడే గంబూషియా చేపపిల్లల ఉత్పత్తి కూడా..
- ఉమ్మడి జిల్లాలో ఏకైక కేంద్రమైనా పట్టించుకోని యంత్రాంగం

వైరా: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏకైక చేపపిల్లల ఉత్పత్తి కేంద్రమైన వైరాలోని మత్స్య విత్తన కేంద్రం నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతోంది. 45 ఏళ్ల కిందట ఏర్పాటైన ఈ కేంద్రంపై పాలకులు, అధికారులు సవతితల్లి ప్రేమ కనబరుస్తుండటంతో రోజురోజుకూ లక్ష్యం కుంటుపడుతోంది. గతంలో చేప పిల్లల ఉత్పత్తి లక్ష్యానికి మించి చేపట్టగా.. ఇప్పుడు సౌకర్యాల లేమి, సిబ్బంది కొరతతో ఆ పరిస్థితి కనుమరుగైంది. కేంద్రంలోకి నీటి సరఫరా చేసే పైపులైన్ల లీకేజీలు, హేచరీ గది శిథిలావస్థకు చేరగా.. ఐదుగురు ఫిషర్‌మెన్లకు ఇద్దరే ఉండటం గమనార్హం. ఈ కేంద్రంలో బంగారు తీగ, బొచ్చ, కట్ల, రోహూ, గంబూషియా వంటి చేప పిల్లలను ఉత్పత్తి చేసే సదుపాయం ఉన్నా పట్టింపు లేనితనంతో సామర్థ్యం పూర్తిగా తగ్గిపోతోంది.

ముంచుకొస్తున్న సీజన్..

చేప పిల్లల ఉత్పత్తి ప్రక్రియను జూన్ మొదటి వారం నుంచే ప్రారంభించడం ఆనవాయితీ. ఒకవేళ వాతావరణం అనుకూలించకపోతే జూలై చివరి వరకు కూడా ఉత్పత్తి ప్రారంభం కాదు. అయితే, ఆగస్టు వరకు కూడా ఉత్పత్తికి అవకాశముంటుంది. తొలుత వివిధ చెరువుల నుంచి సంతానోత్పత్తికి అవకాశమున్న తల్లి చేపలను తీసుకొచ్చి ఇంజక్షన్ వేస్తారు. అలా వచ్చిన గుడ్లను హేచరీలో స్పాన్‌గా మార్చి చేప పిల్లలను ఉత్పత్తి చేస్తారు. ఇదంతా జూన్ నుంచి ఆగస్టు రెండో వారం వరకు పూర్తి చేయాలి. ఆపై చేప పిల్లలను వివిధ మత్స్య సహకార సంఘాలకు సరఫరా చేయాలి. ఈసారి వివిధ రకాల చేపపిల్లలు ఒక్కో రకం 475 లక్షల చొప్పున, గంబూషియా చేపపిల్లలు లక్ష చొప్పున ఉత్పత్తి చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నా ఆ పరిస్థితి కానరావడం లేదు.

దిగుమతి అవసరమే ఉండదు..

వైరాలోని కేంద్రంలో అన్ని వసతులు కల్పించి లక్ష్యం మేరకు చేపపిల్లలను ఉత్పత్తి చేయగలిగితే దాదాపు ఉమ్మడి జిల్లాలోని అన్ని చెరువులకు సరఫరా చేయొచ్చు. అంతేకాక ఏటా వర్షాకాలంలో డ్రైయినేజీల్లో వదిలే గంబూషియా చేపపిల్లల ఉత్పత్తికి సైతం ఇక్కడ అవకాశముంది. కానీ, కేంద్రంపై పట్టింపు లేని తనంతో ఉమ్మడి జిల్లా మాటేమో కానీ కనీసం ఒక జిల్లాకు సరిపడా చేపపిల్లలు కూడా ఉత్పత్తి చేయడం కష్టమేనని తెలుస్తోంది. ప్రధానంగా ఈ కేంద్రంలో కొరమేను చేపపిల్లల ఉత్పత్తికి కూడా అవకాశముంది. దీంతో కొన్నేళ్ల కిందట హైదరాబాద్‌లో ఉబ్బసం నివారణకు మందు పంపిణీ చేసే బత్తిని సోదరులకు సైతం చేపపిల్లలు పంపించేవారు. ఇప్పుడు ఈ పరిస్థితి కనుమరుగైంది.

ఇవీ ప్రధాన సమస్యలు..

మత్స్య విత్తన కేంద్రంలో 38 సిమెంట్ పాండ్లకు గాను ఎనిమిది పనిచేయటం లేదు. మరో ఐదు పాండ్లకు లైనింగ్ సరిగ్గా లేక నీళ్లు నిలిచే పరిస్థితి లేదు. పైప్‌లైన్ల లీకేజీని అరికట్టి ఒక ఓవర్‌హెడ్ ట్యాంక్, ఆధునిక పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. సక్రమంగా పనిచేయని మోటార్ కూడా మరమ్మతు చేయించాలి. ఇక 45 ఏళ్ల కిందట నిర్మించిన కార్యాలయం గదే కాక తల్లి చేపలను తీసుకువచ్చి గుడ్లను హేచరీలో స్పాన్‌గా మార్చేందుకు కీలకమైన హేచరీ గది సైతం శిథిలమైంది. పైపులైన్ల లీకేజీతో హేచరీలకు నీరు సరఫరా కావడం లేదు. బాయిల్డ్ పరికరాలు తుప్పుపట్టిపోయాయి. ఇలా రకరకాల కారణాలతో చేపపిల్లల ఉత్పత్తి సక్రమంగా సాగడం లేదు. వీటికి తోడు కేంద్రానికి ప్రహరీ లేకపోవడంతో ఖాళీ స్థలం ఆక్రమణకు గురవుతోంది.

వైరా మత్స్య విత్తన కేంద్రం వివరాలు	
కేంద్రం పరిధిలో సొసైటీలు	55
సభ్యులు	6 వేలు
సొసైటీ చెరువులు	100
గ్రామ పంచాయతీ చెరువులు	393
ఈ ఏడాది చేప పిల్లల లక్ష్యం (ఒక్కో రకం)	475 లక్షలు
గంబూషియా చేపపిల్లలు	లక్ష

నిధుల కోసం ప్రతిపాదనలు

కేంద్రంలో సరైన వసతులు లేక చేప పిల్లల ఉత్పత్తి చేపట్టడం ఇబ్బందిగానే ఉంది. హెచరీ గది శిథిలావస్థకు చేరడంతో పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరగడం లేదు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపించాం.

–డి.ఆంజనేయస్వామి, జిల్లా మత్స్య శాఖాధికారి

శ్రీలక్ష్మికి నారీ శక్తి అవార్డు


అవార్డు అందుకుంటున్న శ్రీలక్ష్మి

పాల్వంచ: జనహిత ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ బేర శ్రీలక్ష్మి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం నారీశక్తి పురస్కారం అందుకున్నారు. జీసీఎస్ వల్లూరి ఫౌండర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రముఖ న్యూమరాలజీ నిపుణులు దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ కోలాట నృత్యంతో పాటు తాను చేపట్టిన సంఘ సేవా కార్యక్రమాలను గుర్తించి అవార్డు అందించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ కార్గోలో నిర్లక్ష్యం

- అధికారి – హమాలీల మధ్య కోల్డ్‌వార్?
- తరచుగా తారుమారవుతున్న పార్సిళ్లు
- ఇంకొన్ని గమ్యం చేరకుండానే మాయం


ఖమ్మం కొత్త బస్టాండ్‌లోని కార్గో డెలివరీ పాయింట్‌లో పార్సిల్ కోసం వెతుకుతున్న సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కొత్త బస్టాండ్‌లోని కార్గో పాయింట్‌లో హమాలీలు, అధికారి మధ్య విభేదాలతో వినియోగదారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పద్ధతి ప్రకారం పార్సిళ్లను దింపాల్సిన హమాలీలు ఇష్టారీతిన వ్యవహరిస్తుండటంతో వినియోగదారులకు పార్సిళ్లు అందడం లేదు. కొన్ని సందర్భాల్లో పార్సిళ్లు తారుమారు అవుతుండటం.. ఇంకొన్ని గమ్యం చేరకపోవడంతో వినియోగదారుల నుంచి ఎదురవుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక సిబ్బంది ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

ఇక్కడ డిమాండ్

ఖమ్మం రీజియన్ పరిధి కార్గో సెంటర్లలో ఖమ్మం కొత్త బస్టాండ్‌లోని పాయింట్‌కే డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి అత్యధికంగా పార్సిళ్లు బుక్ చేయడంతో పాటు డెలివరీ కూడా ఇక్కడే ఎక్కువ. దీంతో డెలివరీ తీసుకోవడానికి, పార్సిళ్లు ఇవ్వడానికి వచ్చే వినియోగదారులతో 24 గంటల పాటు పాయింట్ కిటకిటలాడుతుంది. ఇక్కడి నుంచి హైదరాబాద్, బెంగళూరు, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు నిత్యం పార్సిళ్లు రవాణా అవుతుండగా.. ఇందులో అత్యంత ఖరీదైన వస్తువులూ ఉంటాయి. అలాగే, రీజియన్‌లోని ఇతర కార్గో పార్సిల్ సెంటర్లు సైతం రద్దీగానే ఉంటాయి.

ఏమవుతున్నాయి?

ఆర్టీసీ ఆధ్వర్యాన కార్గో పార్సిల్ సర్వీస్ ప్రారంభించినప్పటి నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఇతర ప్రైవేట్ కొరియర్ సెంటర్లతో పోలిస్తే త్వరగా డెలివరీ కావడం, భద్రత, ఇతర అంశాలను బేరీజు వేసుకున్న వినియోగదారులు ఇటే మొగ్గు చూపుతున్నారు. దీంతో అనతికాలంలోనే కార్గోకు మంచి ఆదరణ లభించింది. మరోపక్క ఆర్టీసీకి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వస్తోంది. ఈ నేపథ్యాన జాగ్రత్తగా నిర్వహించాల్సిన సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యంతో చెడ్డపేరు మూట కట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల పలు పార్సిళ్లు మాయం కావడం చర్చనీయాంశంగా మారింది. వారం కిందట భద్రాచలం నుంచి ఖమ్మానికి ఐదు బాక్సులతో కూడిన మిరప విత్తనాలను ఓ వ్యక్తి బుక్ చేశాడు. తీరా ఖమ్మానికి రెండు బాక్సులు డెలివరీ పాయింట్‌కు చేరాయి. మిగతా మూడు బాక్సులు లోడ్ అయ్యాయా, లేదా అన్నది కూడా తెలియడం లేదు. పార్సిళ్లు తీసుకునేందుకు వచ్చిన వినియోగదారుడు ప్రశ్నించడంతో అధికారులు సమాధానం చెప్పలేకపోయారు. రెండు రోజుల్లో తెప్పిస్తామని సర్దిచెప్పినా రాకపోవడంతో శనివారం సెంటర్‌కు వచ్చిన సదరు వినియోగదారుడు అధికారులకు ఫిర్యాదు చేశాడు.

ఇష్టారాజ్యం..

కార్గో పాయింట్‌లో అధికారి, హమాలీలకు మధ్య విభేదాల కారణంగా కొత్త బస్టాండ్‌లోని డెలివరీ పాయింట్‌లో అనేక సమస్యలు నెలకొన్నాయి. అధికారిపై అక్కసుతో డెలివరీ పాయింట్‌లోని హమాలీలు ఒక పాయింట్‌లో పెట్టాల్సిన పార్సిళ్లను మరో పాయింట్‌లో పెడుతున్నట్లు సమాచారం. వరుస క్రమం లేకుండా ఇష్టానుసారంగా పడేస్తుండటంతో డెలివరీ ఇచ్చే సమయాన వెతికేందుకు సిబ్బంది ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఫలితంగా వినియోగదారులు గంటల తరబడి వేచి ఉంటున్నారు. గతంలో పది నిమిషాల్లోనే పార్సిళ్లు డెలివరీ ఇచ్చే సిబ్బంది ఇప్పుడు అలా చేయకపోవడంతో ఏం జరుగుతుందోనని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఒకరి పార్సిల్ మరొకరికి ఇవ్వగా.. తీవ్ర వివాదం నెలకొన్నట్లు తెలుస్తోంది.

10 జంటలకు సామూహిక వివాహాలు


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తదితరులు

కొత్తగూడెంరూరల్: భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం 10 జంటలకు సామూహిక వివాహాలు జరిపించారు. కొండపల్లి రమాదేవి కిరణ్మయి ఆధ్వర్యంలో ఒకే ముహూర్తంలో పది జంటలు ఒక్కటయ్యాయి. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పది జంటలు ఒకేసారి పెళ్లి చేసుకోవడం హర్షణీయమని, అందరూ పిల్లాపాపలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏనుగుల అర్జున్‌రావు, గుగులోత్ కృష్ణ, రాజేష్, అభిరామ్, రత్నన్, బాలు తదితరులు పాల్గొన్నారు.



గృహస్థాశ్రమ వైశిష్ట్యం

పెళ్ళి.. ఎందుకోసం?

గృహప్రవేశం చేయాలి. అప్పుడు యజుర్వేదం అంతా మనకు వచ్చా, రాదా అన్న దానితో సంబంధం లేదు. గృహప్రవేశ సందర్భంలో రాముడేం చేసాడో ఆ ఘట్టం చదువుకుంటే చాలు... ఓహ్, గృహప్రవేశం ఇలా చేయాలన్న మాట.. అన్నది తెలుస్తుంది. తండ్రిగారికి తద్దినం పెట్టాల్సి వస్తే రాముడేం చేశాడో చదువుకుంటే సరిపోతుంది. అది పెట్టవలసి వచ్చినప్పుడు ఇలా పెట్టాలని అర్థమవుతుంది. అందుకే వేదం రామాయణంగా ప్రవర్తించింది.

చంద్రవంశాన్ని అంతటినీ వ్యాసుడు రచించాడు. సూర్యవంశాన్ని అంతటినీ కూడా వాల్మీకి వర్ణించాడు. సూర్యుడు, చంద్రుడు పగలూ రాత్రి ప్రకాశిస్తారు. ఒక పగలు, ఒక రాత్రి కలిస్తే ఒక రోజు పూర్తవుతుంది. వాఙ్మయంలో రామాయణం, భారతం ఇతర పురాణాలను వాల్మీకి, వ్యాసుడు అందించారు. స్వార్థంతోనో, ప్రత్యుపకారం ఆశించో కాక దీనివల్ల ధర్మానుష్ఠాన పద్ధతులను అందరికీ అర్థమయ్యే పద్ధతిలో విడమరిచి చెప్పకపోతే జనసామాన్యానికి ఎలా తెలుస్తుందనే సదుద్దేశంతో వారు మనకు ఈ మహోపకారం చేసారు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

వివాహం ఎంత గొప్పది! వివాహం అంటేనే విశిష్టమైనది–అని. దానిని మనకు సంప్రాప్తింప చేయడానికి జరిపే సంస్కారమే వివాహం. అది ఏదో సరదాకోసం కాదురా నాయనా, వివాహం చేసుకుంటా నంటున్నావు కదా, ముందు దానిగురించి, దానిలోని ధర్మ సూక్ష్మాలను గురించి తెలుసుకో. వివాహం అంటే విశిష్టమైనదానిని పొందుట. మరి ఆ విశిష్టమైనదేది? అదే మోక్షం. దీనిని పొందడానికి యోగ్యమైనది ధర్మానుష్ఠానం. అది సక్రమంగా జరగకుండా దానికి అడ్డుపడుతున్నవి ఏవి? అర్థకామాలు రాగద్వేషాలయి పాపపుణ్యాలకు, పునర్జన్మలకు కారణమవుతాయి. అలాకాకుండా దానిని ధర్మబద్ధం చేసి పాశాలు విడిపోవడానికి సంసార ప్రవేశం జరగాలి. అటువంటి గృహస్థాశ్రమంలోకి నీవు ప్రవేశిస్తున్నావు. అలా ప్రవేశించి రాముడేం చేసాడో తెలుసా? సీతారామకళ్యాణ ఘట్టం చూడు. అక్కడ సీతమ్మ ఏం చేసింది ? అసలు పెద్దవాళ్ళనే వాళ్ళు పెళ్ళికూతురిని, పెళ్లికొడుకుని కూర్చోబెట్టి ఏం మాట్లాడారో పరిశీలించు. పెద్దరికం అంటే ఏమిటో కూడా తెలుస్తుంది. ఇవన్నీ తెలిస్తే సంసారంలో ఎప్పటికప్పుడు ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోవడానికి, కుటుంబ జీవితాన్ని చక్కదిద్దుకోవడానికి ఆస్కారం ఏర్పడుతుంది. ఈ ఉద్దేశంతో రుషులు దేశకాలాలతో సంబంధం లేకుండా సర్వకాలాల్లో సర్వజనులకు ఉపయోగపడే విధంగా వాటిని అందించారు. అటువంటి రుషుల రుణం మనకు జన్మతః ఉంది.

మీరు ఎంతో చదువుకున్నారు... సరే. మంచిదే. నేను చదువును తక్కువ చేసి చెప్పడం లేదు. కానీ చదువుతో పాటుగా నిత్యజీవితంలో మనిషి మనిషిగా ఉండడానికి కావలసిన మానవత్వాన్ని నిలబెట్టడం చాలా అవసరం. అలా అది నిలబడాలంటే... రామాయణం, భారతం తదితర గ్రంథాలను బాగా పరిశీలించాలి. అవి నిత్యపారాయణకు యోగ్యత ఉన్న గ్రంథాలు. వాటిని కనీసం రోజుకో అధ్యాయం చొప్పున అయినా చదువుకుంటూ ఉండాలి. ఇంటిపట్టున పెద్దవాళ్ళు పిల్లలతో వాటిగురించి తరచూ మాట్లాడుతూ ఉండాలి. దానివల్ల ధార్మిక జీవనం అలవడడమే గాక, మనుషుల్లో మానవత్వం మిగులుతుంది. అది లేనప్పుడు మీరు సమకూర్చుకున్న జ్ఞానం, ప్రతిభాపాటవాలు సమాజానికి ప్రమాదకరంగా మారవచ్చు.

ఆధ్యాత్మికథ

దృష్టిని బట్టి సృష్టి



ఉత్తర భారత దేశానికి చెందిన ఒక ప్రొఫెసర్ స్వామి వారి దర్శనార్థం తిరుపతి వెళ్ళాడు. తనతో పాటు సహాయకుడిగా పరిశోధక విద్యార్థిని కూడా వెంట తీసుకు వచ్చాడు. తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి అలిపిరి గుండా తిరుమలకు కాలినడకన వెళ్ళాలనేది ప్రొఫెసర్ గారి ఆలోచన. అలిపిరికి వెళ్ళి ఎత్తైన శేషాచల శిఖరాన్ని చూశారు. సముద్ర మట్టానికి 2800 అడుగుల ఎత్తులో ఉన్న ఏడుకొండల్ని చూసి భక్తి భావంతో దణ్ణం పెట్టుకున్నారు. పాదాల మండపం వద్ద శ్రీవారి లోహ పాదాలను నెత్తిన పెట్టుకుని ప్రదక్షిణ చేస్తూ ఉండగా పరిశోధక విద్యార్థి చిన్నగా ప్రొఫెసర్‌ని ఇలా అడిగాడు.

‘‘దేవుడు నిజంగా ఉన్నాడంటారా?’’ అని.

ప్రొఫెసర్ నవ్వి ‘‘దారిలో కనిపిస్తాడు పద!’’ అని చెప్పి కాలి నడకకు పురమాయించాడు.

అలిపిరినుంచి ఆనంద నిలయుని సన్నిధికి దారి తీసే ఆ పడికట్ల దోవలో ప్రకృతి అందాలను వీక్షిస్తూ నడక ప్రారంభించారు. తలయేరు గుండు, గాలి గోపురం, ఏడవ మైలు ప్రసన్నాంజనేయ స్వామి, అక్కగార్ల గుడి, అవ్వాచారి కోన... దాటి మోకాలి మెట్టు చేరారు.

తిరుమల కొండ ‘ఆదిశేషుని అంశ’ అని భక్త జన విశ్వాసం. అందుకే చెప్పులు లేకుండా కొండ ఎక్కుతారు భక్తులు. ఈ కొండను పాదాలతో నడిచి అపవిత్రం చేయకూడదని శ్రీరామానుజులు, హథీరాంజీ బావాజీ మోకాళ్ళ మీద నడిచారని చెబుతారు. అప్పటినుంచి అది మోకాలి మెట్టు అయ్యిందని కూడా తెలుసుకున్నారు. అక్కడ మెట్లు నిలువుగా మోకాలి ఎత్తు ఉండటం వల్ల మోకాళ్ళు పట్టుకుపోసాగాయి పరిశోధక విద్యార్థికి.

మోకాళ్ళ నొప్పులు ఎక్కువైన ఆ విద్యార్థి గట్టిగా ‘‘దేవుడు కనిపిస్తున్నాడు!’’ అని చెప్పాడు.

చిన్న నవ్వు నవ్విన ప్రొఫెసర్, ‘‘అనుకున్నది అనుకున్నట్లు ఎవరికీ జరగదు. అలా జరిగితే ఎవ్వరూ చెప్పిన మాట వినరు. తలచినట్లే అన్నీ జరిగితే... మనిషి దేవుడి ఉనికినే ప్రశ్నిస్తాడు. కష్టాలు, కన్నీళ్లు లేకుంటే తనంత గొప్పవాడు లేడని విర్రవీగుతాడు. అహాన్ని తలకి ఎక్కించుకున్నవాడు తనే దేవుడని చెప్పి ఊరేగుతాడు. జీవితం కష్టసుఖాల మయం కాబట్టే, మనిషి ఆ అతీత శక్తిని ఆరాధిస్తున్నాడు! అందుకే అలిపిరి వద్ద నేల మీద నడిచేటప్పుడు నీకు దేవుడి ఉనికి ప్రశ్నార్థకమయ్యింది. మోకాలిమెట్టు దగ్గరికి వచ్చేసరికి దేవుడు ఉన్నాడని అనిపించింది’’ అని చెప్పి గబగబా మెట్లు ఎక్కసాగాడు.

‘దృష్టిని బట్టి సృష్టి’ అని తెలుసుకున్న విద్యార్థి గోవింద నామస్మరణ చేస్తూ ప్రొఫెసర్ వెనుకనే నడవసాగాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

మంచిమాట



పిచ్చుక మీదనా బ్రహ్మాస్త్రం?

‘‘పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం’’ అనే జాతీయం ఉంది. అతి తక్కువ బలం ఉన్న ప్రాణి మీద అనవసరంగా అతి పెద్ద బలప్రయోగం చేయటం అనే అర్థంలో ఉపయోగిస్తారు. ఎంత చిన్న ప్రాణి అయినా దాని అస్తిత్వం నిరుపయోగం కాదు. విశ్వంలో, ముఖ్యంగా భూగోళంలో, ప్రధానంగా అది ఉండే ప్రాంతంలో అది పోషించవలసిన పాత్ర ఒకటి ఉండనే ఉంటుంది. పర్యావరణ పరిరక్షణ, తద్వారా పర్యావరణ సమతౌల్యత ఉంటాయి. దానికి భంగం కలిగిస్తే పర్యవసానం అనుభవించ వలసి ఉంటుంది.

ఒక పిచ్చుక సంవత్సరంలో 6.5 కిలోల బియ్యం తింటుంది అని చైనాలో ఒకప్పుడు చేపట్టిన సర్వే తెలిపింది. మొత్తం పిచ్చుకలు లేకుండా చేయగలిగితే 60 వేల మందికి ఆహారం లభిస్తుంది అని కూడా తెలిపింది. ఇంకేముంది? అసలే అధిక జనాభా సమస్య ఉన్న చైనా, వీలైనంత మందికి ఆహారం అందించటానికి ఇదొక మార్గం అనుకుని పిచ్చుకల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టింది. 30 లక్షల పిచ్చుకలని చంపారు.

1958 – 61 సంవత్సరాల మధ్య చైనాలో తీవ్రమైన కరవు వచ్చింది. సుమారుగా నాలుగు కోట్ల యాభై వేల మంది చని పోయారు.

కారణం ఏమై ఉంటుంది అని విచారణ చేస్తే పిచ్చుకలు లేక పోవటం వల్ల అని తేలింది. అదెట్లా? పిచ్చుకలు ధాన్యం తినటంతోపాటు పంటలని నాశనం చేసే పురుగులని కూడా తింటాయి. చీడ పురుగులని తినే పిచ్చుకలు లేక పోవటంతో పంటలకి చీడ పట్టి, తెగులు సోకి ధాన్యం దిగుబడి గణనీయంగా తగ్గింది. అది రాను రాను పెరిగింది. ప్రజలు తిండి లేక చనిపోయారు.

దీనికి పరిష్కారం పంటలని నాశనం చేసే తెగుళ్ల కలిగించే పురుగులని రసాయన పదార్థాలు వాడ నవసరం లేకుండా తినేసే పిచ్చుకలు ఉండేట్టు చేయటమే అని నిర్ధారించారు. చేసేది ఏమీ లేక పిచ్చుకలని దిగుమతి చేసుకోవాలనుకున్నారు. రష్యా నుండి పిచ్చుకలని దిగుమతి చేసుకున్నారు. పరిస్థితి అదుపు లోకి వచ్చింది.

ఇటువంటి శాస్త్రీయమైన విషయాలని మన దేశంలో ఒక ఆనవాయితీగా, ఆచారంగా చేయటం అలవాటు. భారతదేశంలో, ముఖ్యంగా తెలుగువారు వరికంకులని కుచ్చుగా అల్లి ఇంటి ముందు వేలాడ దీసే వారు. పిచ్చుకలు వచ్చి ఒక్కొక్క వడ్లగింజని తీసుకు వెళ్లేవి. అది రైతు పురుగులని తిని చీడ పీడల నుండి పంటని రక్షించిన పిచ్చుక పట్ల చూపించే కతజ్ఞత. ఇంటి ముందు కొన్ని గింజలు చల్లటం అలవాటు. ఆ అవకాశం ఉన్నా, లేక పోయినా ప్రతి రోజు పక్షులకి, ప్రత్యేకంగా కాకికి తినబోయే ముందు ఒక ముద్ద పెట్టటం అలవాటు. కాకి పరిసరాల్లో ఉన్న చెత్తని, చిన్న చిన్న పురుగులని తిని శుభ్రం చేస్తుంది. దేవాలయాలలో కూడా బలిహరణం అన్న పేరుతో నాలుగు దిక్కుల అన్నం ఉంచటం సంప్రదాయం. ఇంటి చూరులో పిచ్చుక గూడు పెడితే పరమానందం. ఆ గూట్లో పెట్టిన గుడ్లను పిల్లి తినకుండా కాపలా కాయటం ఒక సరదా. అవి ఉండే ప్రదేశాలని మనం ఆక్రమించి, చెట్లని నరికి వాటికి ఆహారం లేకుండా చేసినందుకు ఈ మాత్రం చేయక పోతే కృతఘ్నులం అవుతాం. అలాగని పిల్లులని పూర్తిగా తరమం. పిల్లి తిరుగుతుంటే ఆ వాసనకి ఎలుకలు విజృంభించవు.

సృష్టిలో ప్రయోజనం లేని జీవి ఒక్కటి కూడా లేదు. గుర్తించక పోవటం మన లోపం. జాగ్రత్తగా గమనిస్తే ఇతర జీవులని, ప్రకృతిని స్వార్థానికి వాడుకుని ఎవరికీ ఉపయోగ పడని ప్రాణి మానవుడొక్కడేనేమో అనిపిస్తుంది. కనీసం పిచ్చుక పాటి అయినా చేయవద్దా?

– డా. ఎన్. అనంత లక్ష్మి

సినిమా



ఎన్టీఆర్

గోవాలో ఆటా పాటా...

మళ్లీ గోవా వెళ్లాడు దేవర. ‘జనతా గ్యారేజ్’ (2016) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం ‘దేవర’. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగాన్ని ఈ ఏడాది అక్టోబరు 10న రిలీజ్ చేయనున్నట్లు గతంలో మేకర్స్ వెల్లడించారు. ఈ చిత్రంలో తండ్రీ కొడుకులుగా ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ గోవాలో ప్రారంభమైంది. ఎన్టీఆర్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్‌లో ఓ సాంగ్, కొంత టాకీ పార్ట్, ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించడానికి ప్లాన్ చేశారట. ఈ ఏడాది మార్చిలో ‘దేవర’ యూనిట్ గోవాలో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించింది. ఇప్పుడు మళ్లీ గోవాలో షూటింగ్ జరుగుతోంది.



అమితాబ్

సీక్వెల్ సెట్‌లో...

గుజరాతీ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు అమితాబ్ బచ్చన్. 2022లో అమితాబ్ ఓ కీలక పాత్రలో నటించిన ‘ఫక్త్ మహిళా మాటే’ చిత్రానికి సీక్వెల్ ఇది. యశ్ సోనీ, దీక్షా జోషి ప్రధాన పాత్రల్లో నటించిన ‘ఫక్త్ మహిళా మాటే’కు మంచి ప్రేక్షకాదరణ దక్కింది. జై బోదాస్ దర్శకత్వంలో ఆనంద్ పండిట్, వైశాల్ షా ఈ చిత్రాన్ని నిర్మించారు. తాజాగా ఈ సినిమాకు సీక్వెల్‌గా ‘ఫక్త్ పురుషో మాటే’ అనే సినిమాను ఆరంభించారు. అమితాబ్, యశ్ సోనీ, మిత్ర గాధ్వీ, ఇషా కన్సారా, దర్శన్ జరీవాలా సీక్వెల్‌లో ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్నారు. ఈ సీక్వెల్‌ని పార్థ్ త్రివేదీతో కలిసి జై బోదాస్ దర్శకత్వం వహిస్తుండటం విశేషం. ప్రస్తుతం అమితాబ్‌తో పాటు ఈ చిత్రం ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. ‘‘అమితాబ్ బచ్చన్‌గారితో ఓసారి పని చేసిన ఎవరైనా ఆయనతో మళ్లీ వర్క్ చేయాలనుకుంటారు. అమితాబ్‌గారి ఎనర్జీ, అంకితభావం సెట్స్‌లో ఉత్సాహాన్ని మరింత పెంచుతోంది’’ అని పేర్కొన్నారు నిర్మాత ఆనంద్ పండిట్. ఈ సంగతి ఇలా ఉంచితే... మహిళల మనసుల్లో ఏముందో తెలుసుకోగల శక్తులు ఓ కుర్రాడికి వస్తాయి. వాటితో ఆ యువకుడు ఏం చేశాడు? విడిపోతున్న ప్రేమికులను ఎలా కలిపాడు? అనే అంశాలతో ‘ఫక్త్ మహిళా మాటే’ చిత్రం సాగుతుంది. ఇక సీక్వెల్ మగవారి కోణంలో ఉంటుందని టైటిల్ స్పష్టం చేస్తోంది.

ఆమెతో నమ్మకం మొదలవుతుంది



దీపికా పదుకోన్

ప్రభాస్ హీరోగా నటించిన తాజా పాన్ ఇండియన్ చిత్రం ‘కల్కి 2898 ఏడీ’. బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకోన్ ఈ సినిమా ద్వారా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషించారు. వైజయంతీ మూవీస్‌పై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 27న విడుదలవుతోంది. కాగా ఈ మూవీ ట్రైలర్‌ని నేడు విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించి, దీపికా పదుకోన్ లుక్‌ను విడుదల చేసింది. ‘ది హోప్ బిగిన్స్ విత్ హర్’ (ఆమెతో నమ్మకం మొదలవుతుంది) అంటూ మేకర్స్ రిలీజ్ చేసిన దీపిక లుక్ నెట్టింట వైరల్‌గా మారింది. ‘‘సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌గా ‘కల్కి 2898 ఏడీ’ రూపొందింది. మహాభారత పురాణ ఘటనల నుండి మొదలై క్రీస్తు శకం 2898లో పూర్తయ్యే కథ ఇది. గతం, భవిష్యత్తుతో ముడిపడిన ఆరువేల ఏళ్ల వ్యవధిలో ఈ చిత్రకథ నడుస్తుంది’’ అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్.

విలన్ వచ్చేశాడు

శివ కార్తికేయన్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఓ యాక్షన్ ప్యాక్డ్ మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీలక్ష్మీ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమాలోని విలన్ పాత్రకు బాలీవుడ్ నటుడు విద్యుత్ జమాల్‌ను తీసుకున్నారు మేకర్స్. ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించి, సెట్స్‌లో విద్యుత్ జమాల్ పాల్గొన్న వీడియోను కూడా షేర్ చేశారు. ‘‘నా స్నేహితుడు విద్యుత్ జమాల్‌తో కలిసి మళ్లీ వర్క్ చేయడం సంతోషంగా ఉంది’’ అని పేర్కొన్నారు మురుగదాస్. విజయ్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో రూపొందిన సూపర్ హిట్ ఫిల్మ్ ‘తుపాకీ’లో విద్యుత్ జమాల్ విలన్‌గా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.



విద్యుత్ జమాల్

ఈ నెలలోనే లాక్‌డౌన్!



అనుపమా పరమేశ్వరన్

ఈ నెలలోనే లాక్‌డౌన్ అంటున్నారు హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్. కానీ కంగారు పడవలసిన అవసరం ఏమీ లేదు. ఎందుకంటే... ఆమె చెబుతున్నది ‘లాక్‌డౌన్’ సినిమా గురించి. అనుపమా పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ‘లాక్‌డౌన్’. ఏఆర్ జీవాను దర్శకుడిగా పరిచయం చేస్తూ లైకా ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెలలోనే విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. కాగా ఈ సినిమాలో అనిత అనే పాత్రలో అనుపమా పరమేశ్వరన్ నటించినట్లుగా తెలుస్తోంది. లాక్‌డౌన్‌లో చిక్కుకుపోయి కష్టాలు పడుతున్న ఓ యువతి నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందట. లాక్‌డౌన్ కష్టాలతోపాటు కరోనా వైరస్ గురించిన అంశాలను ఈ సినిమాలో కాస్త సీరియస్‌గానే చూపిస్తారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. చార్లీ, నిరోషా, ప్రియా వెంకట్, లివింగ్‌స్టన్, ఇందుమతి, రాజ్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు ఎన్ఆర్ రఘునందన్, సిద్ధార్థ్ విపిన్ సంగీతం అందించారు. ఈ సినిమాకు కెమెరా: వీజే సాబు జోసెఫ్.

టీజర్ రొమాంటిక్‌గా ఉంది
– అక్కినేని అమల



బాల రాజశేఖరుని, అమల

చైతన్యా రావ్, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం ‘హనీమూన్ ఎక్స్‌ప్రెస్’. ఈ రొమాంటిక్ కామెడీ సినిమాను బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన అక్కినేని అమల మాట్లాడుతూ– ‘‘తెలుగు సినిమాకు దర్శకత్వం వహించాలన్న బాల రాజశేఖరుని ఆకాంక్ష ఈ సినిమాతో నెరవేరింది. మా అన్నపూర్ణ కాలేజ్ విద్యార్థులు, సిబ్బందిని కూడా ఈ మూవీలోకి తీసుకున్నందుకు హ్యాపీగా ఉంది. టీజర్ ఫన్నీగా, రొమాంటిక్‌గా ఉంది. నేటి సమాజంలోని వివాహ బంధాల గురించి ఒక బలమైన కథను ప్రేక్షకులకు చూపించబోతున్నట్లుగా టీజర్ ద్వారా తెలుస్తోంది. ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి’’ అన్నారు. ‘‘రొమాంటిక్ కామెడీగా ‘హనీమూన్ ఎక్స్‌ప్రెస్’ అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సుచిన్ సినిమాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ వారు మా చిత్రాన్ని విడుదల చేస్తున్నారు’’ అన్నారు బాల రాజశేఖరుని. తనికెళ్ల భరణి, సుహాసిని, అరవింద్ కృష్ణ, అలీ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: కల్యాణీ మాలిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: ఆర్పీ పట్నాయక్, కెమెరా: శిష్ట్లా వీఎమ్‌కే.

భూగోళానికే నా చెలి అందం



శ్రీకమల్, తాన్వీ

‘‘ప్రపంచానికే జాబిలి అందం.. భూగోళానికే నా చెలి అందం... ఇంతందాన్ని ఎవరైనా చూశారా..’’ అంటూ సాగే పాట ‘ఉషా పరిణయం’ సినిమాలోనిది. ‘నువ్వే కావాలి, మన్మథుడు, మల్లీశ్వరి’ వంటి చిత్రాలను తెరకెక్కించిన కె. విజయభాస్కర్ స్వీయదర్శకత్వంలో నిర్మించిన చిత్రం ‘ఉషా పరిణయం’. ఈ మూవీలో ఆయన తనయుడు శ్రీకమల్ హీరోగా నటించారు. తెలుగు అమ్మాయి తాన్వీ ఆకాంక్ష హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ‘ఆకాశానికే జాబిలి అందం...’ అనే పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. ఈ చిత్ర సంగీత దర్శకుడు ఆర్ఆర్ ధ్రువన్ పాడిన ఈ పాటకు అలరాజు సాహిత్యం అందించారు. ‘‘ప్రేమకు నేనిచ్చే నిర్వచనం ఈ సినిమా. అన్ని రకాల ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయి’’ అన్నారు కె. విజయభాస్కర్.

మూడు షెడ్యూల్స్‌లో...



అవినాష్, సిమ్రాన్

అవినాష్ తిరువీధుల, సిమ్రాన్ చౌదరి జంటగా కొత్త సినిమా షురూ అయింది. కార్తీ దర్శకత్వంలో సిల్వర్ స్క్రీన్ సినిమాస్ ఎల్ఎల్‌పీపై శాంతనూపతి, ఆలపాటి రాజా, అవినాష్ బుయాని, అంకిత్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. తొలి సీన్‌కి నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి క్లాప్ కొట్టగా, దర్శకుడు బాబీ దర్శకత్వం వహించారు. దర్శకుడు కార్తీ మాట్లాడుతూ– ‘‘కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు మా సినిమా నచ్చుతుంది. నేడు రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి, మూడు షెడ్యూల్స్‌లో చిత్రీకరణ పూర్తి చేస్తాం’’ అన్నారు. ‘‘మంచి సినిమా తీయాలనే సంకల్పంతో అమెరికా నుంచి వచ్చాం’’ అన్నారు శాంతనూపతి. ఈ ప్రారంభోత్సవంలో నిర్మాతలు అంబికా కృష్ణ, దామోదర ప్రసాద్, టి. రామసత్యనారాయణ, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌నాయుడు, రచయిత విశ్వజిత్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఎ. విశ్వనాథ్, సంగీతం: వివేక్ సాగర్, లైన్ ప్రొడ్యూసర్: రాంబాబు కుంపట్ల.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
10-6-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,619	469
76,693	23,290

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	17,133	▽	40
డోజోన్స్	38,799	▽	87
ఎఫ్‌టీఎస్ఈ 100	8,245	▽	40
డాక్స్	18,557	▽	95
షాంఘై	3,051	△	2
నికాయ్	38,684	▽	20

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్


ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధామస్‌కుక్	81.54	85.22
£	బ్రిటన్ పౌండ్	ధామస్‌కుక్	104.33	109.19
€	యూరో	ధామస్‌కుక్	88.64	93.11
¥	జపాన్ ఎన్ (100)	ధామస్‌కుక్	41.00	66.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధామస్‌కుక్	53.23	58.01
S$	సింగపూర్ డాలర్	ధామస్‌కుక్	59.69	64.36
SAR	సౌదీ రియాల్	ధామస్‌కుక్	21.34	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	ధామస్‌కుక్	21.81	23.60
¥	చైనా యువాన్	ధామస్‌కుక్	10.39	12.46

బంగారం బంగారమే



కాలంతో పాటే దేశీ కరెన్సీ విలువ తరిగిపోతుంటుంది. కానీ, కాలంతోపాటే విలువ పెంచుకుంటూ వెళ్లే వాటిల్లో బంగారం కూడా ఒకటి. అందుకే ప్రతి ఒక్కరి పెట్టుబడుల్లో బంగారానికి (గోల్డ్) తప్పక చోటు ఇవ్వాలి. ఇటీవలి కాలంలో బంగారంలో మంచి ర్యాలీ చూస్తున్నాం. ప్రతి ఏటా పసిడి ఇదే మాదిరి పరుగు పెట్టకపోవచ్చు. కానీ, దీర్ఘకాలంలో మంచి రాబడిని ఇచ్చే విషయంలో నిజంగా 'బంగారమే' అని ఎవరైనా ఒప్పుకుని తీరాల్సిందే. 2017–18 సంవత్సరం సావరీన్ గోల్డ్ బాండ్ (ఎస్‌జీబీ)లో ఇన్వెస్ట్ చేసినవారికి గడిచిన ఐదేళ్లలో ఏటా 16.5 శాతం రాబడి వచ్చింది. సంప్రదాయ డెట్ సాధనాల కంటే రెట్టింపు రాబడి బంగారంలో రావడం అంటే మామూలు విషయం కాదు. ఈక్విటీల స్థాయిలో బంగారం రాబడి ఇవ్వడం విశేషం. అందుకే దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేసే వారు బంగారానికి తప్పక చోటు ఇవ్వాలి. ఏ రూపంలో ఇన్వెస్ట్ చేస్తే ఎక్కువ ప్రయోజనమో తెలియజేసే కథనమే ఇది.



వివిధ సాధనాలు

బంగారంలో ఇన్వెస్ట్ చేయడానికి ఎన్నో మార్గాలున్నాయి. ఆభరణాలను పెట్టుబడిగా చూడొద్దు. ధరించడానికి కావాల్సినంత వరకే ఆభరణాలకు పరిమితం కావాలి. పెట్టుబడి కోసం అయితే ఎలక్ట్రానిక్ రూపంలో ఎన్నో సాధనాలు ఉన్నాయి. వీటిల్లో తమకు నచ్చిన దానిని ఎంపిక చేసుకోవచ్చు. గోల్డ్ ఈటీఎఫ్‌లు, గోల్డ్ ఫండ్స్, సావరీన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీలు), డిజిటల్ గోల్డ్ అందుబాటులో ఉన్న పలు రకాల సాధనాలు. వీటన్నింటిలోకి ఎస్‌జీబీలు ఎక్కువ ప్రయోజనకరం.

గోల్డ్ ఈటీఎఫ్‌లు

స్టాక్స్ మాదిరే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో నిత్యం ట్రేడ్ అవుతుంటాయి. ఇందులో చార్జీలు, వ్యయాలు చాలా తక్కువ. భౌతిక బంగారం ధరలకు అనుగుణంగానే గోల్డ్ ఈటీఎఫ్ ధర ఏరోజుకారోజు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో మారుతుంటుంది. నచ్చినప్పుడు కొనుగోలు చేసుకుని, అవసరమైనప్పుడు సులభంగా విక్రయించుకోవచ్చు. వీటిల్లో ఎక్స్‌పెన్స్ రేషియో రూపంలో ఏటా నిర్ణీత మొత్తాన్ని చార్జీగా తీసుకుంటారు. వీటిల్లో ఇన్వెస్ట్ చేయాలంటే డీమ్యాట్ ఖాతా తప్పనిసరి. ఉదాహరణకు ఎల్ఐసీ గోల్డ్ ఈటీఎఫ్‌లో ఎక్స్‌పెన్స్ రేషియో 0.41 శాతంగా ఉంది. ఈ ఫండ్‌లో రూ.లక్ష ఇన్వెస్ట్ చేశారనుకోండి. దీనిపై 0.41 శాతం ప్రకారం రూ.410ని ఎక్స్‌పెన్స్ రేషియో కింద ఎల్ఐసీ మ్యూచువల్ ఫండ్ వసూలు చేస్తుంది. ఇది కూడా సంవత్సరానికి ఒకే విడతగా కాకుండా, ఏ రోజుకారోజు ఇన్వెస్టర్ యూనిట్ల నుంచి తీసుకుంటుంది. పెట్టుబడులను ఉపసంహరించుకుంటే ఎగ్జిట్ లోడ్ ఉండదు. పెట్టుబడులపై వచ్చిన లాభాన్ని వార్షిక ఆదాయానికి చూపించి, తాము ఏ శ్లాబు పరిధిలోకి వస్తే ఆ మేరకు పన్ను చెల్లించాలి.

గోల్డ్ ఫండ్స్

ఇన్వెస్టర్ల పెట్టుబడులను తీసుకెళ్లి గోల్డ్ ఈటీఎఫ్‌లలో ఇన్వెస్ట్ చేయడమే గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ చేసే పని. కనుక వీటికి బదులు నేరుగా గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోనే పెట్టుబడులు పెట్టుకోవచ్చు. కానీ, కొందరికి గోల్డ్ మ్యూచువల్ ఫండ్సే అనుకూలం. ఎలా అంటే.. గోల్డ్ ఈటీఎఫ్ ఒక యూనిట్ ఒక గ్రాము బంగారం పరిమాణంలో ట్రేడవుతుంటుంది. కనుక ఎంతలేదన్నా ఒక గ్రాము బంగారం స్థాయిలో ఒకే విడత ఇన్వెస్ట్ చేసుకోవాల్సి వస్తుంది. అదే గోల్డ్ మ్యూచువల్ ఫండ్‌లో అయితే రూ.1,000 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో గోల్డ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. గోల్డ్ ఈటీఎఫ్‌లో పెట్టుబడికి డీమ్యాట్ ఖాతా తప్పనిసరి. కొనుగోలు చేసిన యూనిట్లు డీమ్యాట్ ఖాతాకే జమ అవుతాయి. కానీ గోల్డ్ ఫండ్స్‌లో పెట్టుబడులకు డీమ్యాట్ ఖాతా తప్పనిసరి కాదు. కాకపోతే గోల్డ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకునే వారికి కొంచెం అదనపు భారం పడుతుంది. గోల్డ్ ఈటీఎఫ్‌లలో ఇన్వెస్ట్ చేయడం వల్ల అక్కడ ఎక్స్‌పెన్స్ రేషియో.. తిరిగి గోల్డ్ మ్యూచువల్ ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియో పేరిట రెండు సార్లు చార్జీ చెల్లించాల్సి వస్తుంది. వీటిల్లో పెట్టుబడులు విక్రయించినప్పుడు వచ్చిన లాభాన్ని రిటర్నుల్లో చూపించి, తమ శ్లాబు రేటు ప్రకారం చెల్లించాలి.



డిజిటల్ గోల్డ్

ఫోన్‌పే, పేటీఎం, పలు ఫిన్‌టెక్ సంస్థలు డిజిటల్ గోల్డ్ కొనుగోలుకు వీలు కల్పిస్తున్నాయి. రూపాయి నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఎప్పుడు కావాలంటే అప్పుడు విక్రయించుకోవచ్చు. ఇన్వెస్టర్ కొనుగోలు చేసిన పరిమాణం మేర అసలైన బంగారం ఖజానాల్లో భద్రపరుస్తారు. కొంత మొత్తం సమకూరిన తర్వాత (కనీసం 10 గ్రాములు అంతకుమించి) భౌతిక రూపంలో తీసుకోవచ్చు. లేదా ఎంపిక చేసిన జ్యుయలరీ సంస్థల్లో ఆభరణాల కిందకు మార్చుకోవచ్చు. అవసరం ఏర్పడితే దీనిపై రుణం పొందొచ్చు. ఇందులో కాస్త చార్జీలు ఎక్కువ. ఒక ఇన్వెస్టర్ ఒక ప్లాట్‌ఫామ్‌లో గరిష్టంగా రూ.2లక్షలు మించి కొనుగోలు చేయలేరు. ఆర్‌బీఐ, సెబీ తదితర నియంత్రణ సంస్థల పర్యవేక్షణ వీటిపై ఉండదు. ఇందులో వచ్చే లాభాలు సైతం వార్షిక ఆదాయానికి కలిపి చూపించాల్సి ఉంటుంది.



బంగారం బాండ్లు

భౌతిక బంగారంపై పెట్టుబడుల ఒత్తిడిని తగ్గించేందుకు.. డిజిటల్ రూపంలో బంగారంపై పెట్టుబడులను, పారదర్శకతను ప్రోత్సహించేందుకు కేంద్రం తీసుకొచ్చిన సాధనమే సావరీన్ గోల్డ్ బాండ్స్ పథకం. ప్రతీ ఆర్థిక సంవత్సరంలోనూ ఒకటికి మించిన పర్యాయాలు ఎస్‌జీబీలను ప్రభుత్వం తరఫున ఆర్‌బీఐ విక్రయిస్తుంటుంది. ఒక గ్రాము డినామినేషన్ రూపంలో బాండ్లను కొనుగోలు చేసుకోవచ్చు. ఇష్యూ సమయంలో ఒక గ్రాము ధర ఎంతన్నది ఆర్‌బీఐ ప్రకటిస్తుంది. బ్యాంక్‌లు, బ్రోకరేజీ సంస్థలు, ఎంపిక చేసిన పోస్టాఫీసులు, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ కొనుగోలుకు అవకాశం కల్పిస్తుంటాయి. ఈ బాండ్ కాల వ్యవధి ఎనిమిదేళ్లు. ఇందులో పెట్టుబడిపై ఏటా 2.5 శాతం చొప్పున ఎనిమిదేళ్ల పాటు వడ్డీని ఆర్‌బీఐ ప్రతి ఆరు నెలలకు ఒకసారి చొప్పున చెల్లిస్తుంది. ఎనిమిదేళ్ల తర్వాత బంగారం మార్కెట్ ధర ప్రకారం ఇన్వెస్టర్‌కు ఆర్‌బీఐ చెల్లింపులు చేస్తుంది. లాభంపై పన్ను లేకపోవడం, ఏటా 2.5 శాతం రాబడి వల్ల అన్నింటిలోకి ఇది మెరుగైన సాధనం అని చెప్పుకోవాలి. ఇక ఎస్‌జీబీపై ఏటా వచ్చే 2.5 శాతం వడ్డీ రాబడి పన్ను పరిధిలోకి వస్తుంది. రిటర్నుల్లో 'ఇన్‌కమ్ ఫ్రమ్ అదర్ సోర్సెస్'లో చూపించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఎనిమిదేళ్ల పాటు పెట్టుబడి కొనసాగించినట్టయితే.. వచ్చే మూలధన లాభంపై పన్ను ఉండదు. మధ్యలోనే వైదొలిగితే లాభం పన్ను పరిధిలోకి వస్తుంది. ''ఏడాదిలోపే విక్రయించినప్పుడు వచ్చిన లాభాన్ని వార్షిక ఆదాయానికి కలిపి రిటర్నుల్లో చూపించి, పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఏడాది తర్వాత విక్రయించేట్టు అయితే లాభంపై 10 శాతం పన్ను చెల్లించాలి. లాభం నుంచి ద్రవ్యోల్బణాన్ని తీసేసే ఇండెక్సేషన్ ఎంపిక చేసుకుంటే కనుక 20 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది''అని ఆర్ఎస్ఎం ఇండియా వ్యవస్థాపకుడు సురేష్ సురానా తెలిపారు. ఈ బాండ్‌కు ప్రభుత్వ హామీ ఉంటుంది.

రాబడులు

బంగారంపై పెట్టుబడి దీర్ఘకాలంలో డెట్ కంటే మెరుగైన రాబడే ఇచ్చినట్టు చారిత్రక గణాంకాలు చెబుతున్నాయి. గడిచిన 20 ఏళ్లలో ఏటా 11 శాతం కాంపౌండెడ్ రాబడిని బంగారం ఇచ్చింది.

సంవత్సరం వారీ 10 గ్రాముల బంగారం ధరలు (రూపాయిల్లో)

సంవత్సరం	ధర
2015	26,343
2016	28,623
2017	29,667
2018	31,438
2019	35,220
2020	48,651
2021	48,720
2022	52,670
2023	65,330
2024	71,913



ఎస్‌జీబీల్లో రాబడి

ఇండియా బులియన్‌అండ్ జ్యుయలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) ప్రకటించే 999 స్వచ్ఛత బంగారం (గత మూడు పనిదినాల్లోని సగటు)ధరను ఆర్‌బీఐ పరిగణనలోకి తీసుకుంటుంది. ఐబీజేఏ ధర మార్కెట్ ఆధారితమే. మొదటి విడత జారీ చేసిన ఎస్‌జీబీ 2016– సిరీస్1 బాండ్ గడువు ఈ ఏడాది ఫిబ్రవరి 8న ముగిసింది. నాడు ఒక గ్రాము బాండ్ రూ.2,600కు విక్రయించారు. గడువు ముగిసిన రోజు ఆర్‌బీఐ నిర్ణయించిన ధర రూ.6,271. ఇందులో ఇన్వెస్ట్ చేసి చివరి వరకు కొనసాగిన వారికి ఏటా 11% రాబడి వచ్చింది. 2.5% వడ్డీ రాబడిని కలిపి చూస్తే వార్షికంగా 11.63 శాతం చొప్పున నికర రాబడి వచ్చినట్టు. ఇది బంగారం గత 20 ఏళ్ల సగటు రాబడి కంటే ఎక్కువే ఉండడం గమనార్హం. తర్వాత వచ్చిన సిరీస్‌లపై రాబడులు మరింత అధికంగా ఉంటున్నాయి.

సిరీస్-8, 9 రాబడులు

బాండ్	జారీ తేదీ	జారీ ధర (రూ.లో)	మెచ్యూరిటీ ధర (రూ.లో)	వడ్డీ రాబడి
ఎస్‌జీబీ 2017-18,సిరీస్-8	20 నవంబర్ 2017	2,961	7,217	16.50
ఎస్‌జీబీ 2017-18, సిరీస్-9	27 నవంబర్ 2017	2,964	7,217	16.44



2017 నవంబర్ 1 నుంచి 2024 ఏప్రిల్ 30 మధ్య నిఫ్టీ50 సూచీ ఇచ్చిన వార్షిక కాంపౌండెడ్ రాబడి 13.62% ఎస్‌జీబీ సిరీస్–8,9 కంటే తక్కువగా ఉండడం గమనించొచ్చు. (వడ్డీ శాతాల్లో)

ఇతర వివరాలు

ఎస్‌జీబీలపై వడ్డీని ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇన్వెస్టర్ బ్యాంక్ ఖాతాకు జమ చేస్తారు. చివరి ఆరు నెలల వడ్డీ, మెచ్యూరిటీతో కలిపి ఇస్తారు. ఒక ఇన్వెస్టర్ కనిష్ఠంగా ఒక గ్రాము, గరిష్టంగా ఒక ఆర్థిక సంవత్సరంలో 4 కిలోల వరకు కొనుగోలు చేసుకోవచ్చు. ఎస్‌జీబీలను ఎనిమిదేళ్ల పాటు గడువు పూర్తయ్యే వరకు కొనసాగించినప్పుడే లాభంపై ఎలాంటి పన్ను పడదు. ఒకవేళ ఈ మధ్యలోనే వైదొలిగితే లాభం వార్షిక ఆదాయానికి కలిపి చూపించి పన్ను చెల్లించాల్సి వస్తుంది. ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసే వారికి ప్రతి గ్రాముపై రూ.50 తగ్గింపు లభిస్తుంది.

కేటాయింపులు ఎంత మేర?

ఒకరి మొత్తం పెట్టుబడుల్లో కనీసం 5% బంగారంపై ఇన్వెస్ట్ చేసుకోవాలన్నది నిపుణుల సూచన. గరిష్ఠంగా 10 వరకు కేటాయించుకోవచ్చు. మోస్తరు రాబడులు వచ్చినా ఫర్వాలేదు, రిస్క్ వద్దనుకునే ఇన్వెస్టర్లు తమ పోర్ట్‌ఫోలియోలో 15% వరకు కూడా బంగారంపై ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. కానీ, పెట్టుబడి కోసం భౌతిక బంగారం అంత మెరుగైన ఆప్షన్ కాబోదు. ఎందుకంటే అసలు బంగారం ధరకు తోడు, కొనుగోలు ధరపై 3% మేర జీఎస్‌టీని భరించాల్సి ఉంటుంది. అదే పెట్టుబడి కోసం అని చెప్పి ఆభరణాలు కొనుగోలు చేస్తే దానిపై తయారీ చార్జీలు, తరుగు భరించాల్సి వస్తుంది. ఇవన్నీ నికర రాబడులను ప్రభావితం చేస్తాయి. కనుక బంగారంపై పెట్టుబడి ఎప్పుడూ కూడా డిజిటల్‌గానే ఉంచుకోవడం మంచి ఆప్షన్ అవుతుంది. దీనివల్ల భద్రతాపరమైన రిస్క్ కూడా ఉండదు.

ముందస్తు ఉపసంహరణ ఎలా?

ఎస్‌జీబీ కాల వ్యవధి ఎనిమిదేళ్లు అయినప్పటికీ.. కోరుకుంటే ఆ లోపు కూడా విక్రయించుకోవచ్చు. కొనుగోలు చేసిన తేదీ నుంచి ఐదేళ్లు ముగిసిన తర్వాత ఆర్‌బీఐ ముందస్తు ఉపసంహరణకు వీలు కల్పిస్తోంది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ అవకాశం ఉంటుంది. బంగారం బాండ్‌పై ఆరు నెలలకు ఒకసారి ఆర్‌బీఐ వడ్డీ చెలిస్తుందని చెప్పుకున్నాం కదా. ఆ వడ్డీ చెల్లింపు తేదీ నుంచి 21 రోజుల ముందు వరకు ఇన్వెస్టర్ తన వద్దనున్న బాండ్‌ను ఆర్‌బీఐకి ఇచ్చేయాలి. దీనిపై ఎలాంటి చార్జీలు ఉండవు. ఇక ఇన్వెస్ట్ చేసిన తేదీ నుంచి ఐదేళ్లలోపే బాండ్‌ను విక్రయించుకోవాలంటే.. ఉన్న ఏకైక మార్గం స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ లేదా బీఎస్ఈ). కాకపోతే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో కొనుగోలుదారులు పరిమితంగా ఉంటుంటారు. లిక్విడిటీ తక్కువగా ఉంటుంది. కొనుగోలుదారు అందుబాటులో ఉంటే విక్రయించుకోవచ్చు. కాకపోతే డిమాండ్ తక్కువ కనుక మార్కెట్ రేటు కంటే తక్కువకే ఇక్కడ విక్రయాలు నమోదవుతుంటాయి. బంగారం బాండ్ భౌతిక రూపంలో ఉంటే దాన్ని డీమెటీరియలైజ్ చేసుకున్న తర్వాతే విక్రయించుకోవడం సాధ్యపడుతుంది.



టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్

మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ ఫండ్



ప్రైవేట్ రంగ జీవిత బీమా సంస్థ టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఇది జూన్ 15 వరకు అందుబాటులో ఉంటుంది. యూనిట్ ఎన్ఏవీ రూ.10గా ఉంటుంది. టాటా ఏఐఏ పాలసీదారులు కంపెనీకి చెందిన ఫార్చ్యూన్ ప్రో, వెల్త్ ప్రో, ఫార్చ్యూన్ మ్యాక్సిమా వంటి యులిప్ పథకాలు, వినూత్న పరమ్ రక్షక్ ప్లస్, ప్రో–ఫిట్ వంటి పథకాల ద్వారా ఇందులో ఇన్వెస్ట్ చేయొచ్చు. నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 మూమెంటమ్ 50 ఇండెక్స్‌లో అధిక వృద్ధి అవకాశాలున్న టాప్ 50 కంపెనీల పనితీరును ఇది ట్రాక్ చేస్తుంది. దీర్ఘకాలంలో పెట్టుబడి వృద్ధిని, మెరుగైన రాబడులను కోరుకుంటున్న ఇన్వెస్టర్లకు ఇది అనువైనదని సంస్థ తెలిపింది. గడిచిన 9 ఏళ్లలో మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ 11 రెట్లు పెరిగినట్టు వివరించింది. తయారీ.. సర్వీసులు వృద్ధి చెందుతుండటం, వినియోగ డిమాండ్ పెరుగుతుండటం, పొదుపు మొత్తాలు ఈక్విటీల వైపు మళ్లుతుండటం వంటి అంశాలు ఈ విభాగ సంస్థలకు సానుకూలమని వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్/100కు రూ.లలో)

10-6-2024

విశాఖ	475–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	470–00
విజయవాడ	475–00
హైదరాబాద్	500–00
వరంగల్	502–00

రాబడుల్లో స్థిరత్వం.. డీఎస్‌పీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్

ఫండ్ రివ్యూ

మార్కెట్లో అన్ని విభాగాల్లో పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ అనుకూలంగా ఉంటాయి. దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేసుకోవాలనుకునే వారు తమ పోర్ట్‌ఫోలియోలో ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌కు చోటు కల్పించుకోవచ్చు. ఈ విభాగంలో డీఎస్‌పీ ఫ్లెక్సీక్యాప్ ఫండ్ మంచి పనితీరు చూపిస్తున్న వాటిల్లో ఒకటిగా ఉంది.

రాబడులు

గడిచిన ఆరు నెలల కాంలో ఈ పథకం 7.32 శాతం రాబడిని ఇచ్చింది. అదే ఏడాది కాలంలో రాబడి 27.50 శాతంగా ఉంది. మూడేళ్లలో 13.43 శాతం, ఐదేళ్లలో 16.58 శాతం, ఏడేళ్లలో 14 శాతం, పదేళ్లలో 14.30 శాతం చొప్పున ఏటా రాబడులు ఈ పథకంలో ఉన్నాయి. ఈ పథకం 1997 ఏప్రిల్ 29న ప్రారంభమైంది. నాటి నుంచి చూస్తే ఏటా 19 శాతం రాబడిని ఇచ్చింది. గతంలో ఈ పథకం మల్టీక్యాప్‌గా ఉండేది. మ్యూచువల్ ఫండ్స్ పథకాల పునర్‌వ్యవస్థీకరణ అనంతరం సెబీ ఆదేశాల మేరకు ఫ్లెక్సీక్యాప్ విభాగం కిందకు మారింది. మ్యూచువల్ ఫండ్స్‌లో దీర్ఘకాలంలో వార్షిక రాబడి కనీసం 12 శాతంపైన ఉంటే దాన్ని మెరుగైనదిగా నిపుణులు పరిగణిస్తుంటారు.

పెట్టుబడుల విధానం

లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో ఆకర్షణీయమైన పెట్టుబడుల అవకాశాలను ఈ పథకం ఎంపిక చేసుకుంటుంది. ఒక విభాగంలో వ్యాల్యుయేషన్స్ ఖరీదుగా మారిన సందర్భాల్లో పెట్టుబడులు తగ్గించుకుని, ఆకర్షణీయంగా ఉన్న ఇతర విభాగాల్లోకి అధిక పెట్టుబడులు మళ్లిస్తుంటుంది. నాణ్యమైన, సత్తా ఉన్న కంపెనీలను ఎంపిక చేసుకుని, ఎక్కువ కాలం పాటు కొనసాగడాన్ని అనుసరిస్తుంది. మార్కెట్ కరెక్షన్లలో ఎక్కువగా పెట్టుబడులు పెడుతుంటుంది. లార్జ్‌క్యాప్‌నకు ఎక్కువ కేటాయింపులు చేయడం ద్వారా 2008, 2011, 2015, 2020 మారెకెట్ పతనాల్లో నష్టాలను పరిమితం చేసింది. అదే సమయంలో మార్కెట్ ర్యాలీల్లోనూ మెరుగైన ప్రదర్శనే చేసింది. 2020 మార్చి మార్కెట్ పతనం సమయంలో ఈక్విటీల్లో పెట్టుబడులు 93 శాతంగానే ఉన్నాయి. మార్కెట్ల విలువలు గరిష్టాలకు చేరాయన్న జాగ్రత్తతో నగదు నిల్వలను 7 శాతానికి పెంచుకుంది. అదే ఏడాది దిద్దుబాటు అనంతరం క్రమంగా ఈక్విటీల్లో పెట్టుబడులను పెంచుకుంది.



పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ. 10,409 కోట్ల ఇన్వెస్టర్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 97.39 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, 2.61 శాతం మేర నగదు నిల్వలు కలిగి ఉంది. 63 శాతం పెట్టుబడులను లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేసింది. మిడ్‌క్యాప్ కంపెనీలకు 31.63 శాతం, స్మాల్‌క్యాప్ కంపెనీలకు 4.77 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది. ఎక్స్‌పెన్స్ రేషియో 1.75 శాతంగా ఉంది. ఒక విధంగా ఈ పథకం ఇన్వెస్టర్ల నుంచి ఎక్కువ చార్జీ వసూలు చేస్తున్నట్టు భావించొచ్చు. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 56 స్టాక్స్ ఉన్నాయి. పోర్ట్‌ఫోలియోని పరిశీలిస్తే.. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ, 33 శాతం మేర పెట్టుబడులను ఈ రంగాల కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేసింది. ఇండస్ట్రియల్స్‌కు 11.95 శాతం, కన్జ్యూమర్ డిస్క్రీషినరీకి 11.22 శాతం, టెక్నాలజీ రంగ కంపెనీలకు 10 శాతం, మెటీరియల్స్ కంపెనీలకు 8.79 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్ (అంకెలు శాతాల్లో)

కంపెనీ	పెట్టుబడులు
బజాజ్ ఫైనాన్స్	6.49
ఐసీఐసీఐ బ్యాంక్	5.96
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	5.25
మదర్సన్ సుమీ	4.08
యాక్సిస్ బ్యాంక్	3.47
అవెన్యూ సూపర్‌మార్ట్స్	3.21
పాలీక్యాబ్ ఇండియా	2.81
ఇన్ఫోసిస్	2.72
ఇండస్ టవర్స్	2.64
గుజరాత్ ఫ్లోరోకెమ్	2.37

జాగిల్ ప్రీపెయిడ్	ఈక్విరస్ సెక్యూరిటీస్	కొనొచ్చు

స్టాక్స్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 281 టార్గెట్: రూ. 400

ఎందుకంటే: జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్.. సాస్(ఎస్ఏఏఎస్) ఆధారిత వినియోగ వ్యయ(స్పెండ్స్) మేనేజ్‌మెంట్, అనలిటిక్స్ లీడింగ్ ప్లాట్‌ఫామ్. కంపెనీ ప్రత్యేక బిజినెస్ మోడల్‌ను కలిగి ఉంది. ప్రధానంగా చానల్ భాగస్వాములు, ఉద్యోగులు, వెండార్ ప్లాట్‌ఫామ్స్ కోసం ఉద్యోగుల(ఎంప్లాయీ) రీఇంబర్స్‌మెంట్స్, పన్ను లబ్ధి(ట్యాక్స్ బెనిఫిట్స్), రివార్డులు, ప్రోత్సాహకాల(ఇన్సెంటివ్స్) సంబంధ సర్వీసులు అందిస్తోంది. ప్రొడక్ట్ ద్వారా లబ్ధి పొందుతున్న కార్పొరేట్ల నుంచి ఆదాయంలో ప్రత్యక్షంగా 10 నుంచి 20 శాతమే సమకూర్చుకుంటోంది. ఇది అటు కార్పొరేట్లకు ఇటు కంపెనీకి ప్రయోజకారిగా నిలుస్తోంది. కార్డుల వినియోగం జరిగే లేదా రివార్డ్ వోచర్లు రీడీమ్ అయ్యే మర్చంట్ల నుంచి మిగిలిన ఆదాయాన్ని పొందుతోంది. కార్యకలాపాలు విస్తరించిన మూడు ప్రొడక్టుల విభాగాలలోనూ సరైన పోటీదారులు లేకపోవడం కంపెనీకి బలాన్నిస్తోంది. 2026–27 ఆర్థిక సంవత్సరానికల్లా కంపెనీ సర్వీసులందిస్తున్న రంగం దేశీ మార్కెట్ పరిమాణం రూ. 13,900 కోట్లకు చేరుతుందని పరిశ్రమ వర్గాల అంచనా. కంపెనీ లైఫ్‌సైకిల్‌లో ప్రస్తుతం ప్రాథమిక దశలోనే ఉన్నట్లు భావిస్తున్నాం. వెరసి కొత్త కస్టమర్లను పొందడం, ప్రస్తుత కస్టమర్లకూ ఇతర ప్రొడక్టులను విక్రయించగలగడం(క్రాస్ సెల్లింగ్), కొత్త ప్రొడక్టులను ప్రవేశపెట్టడం, విదేశాలలోనూ కార్యకలాపాలు విస్తరించడం తదితరాల ద్వారా కంపెనీ భారీ వృద్ధికి పలు అవకాశాలున్నాయి. ఇటీవల జోయర్ పేరుతో విడుదల చేసిన వెండార్ పేమెంట్స్ సొల్యూషన్స్ దీనికి జత కలవనుంది.



ఆస్క్ ఆటోమోటివ్	జేఎమ్ ఫైనాన్షియల్	కొనొచ్చు

ప్రస్తుతధర:రూ. 314 టార్గెట్: రూ. 375

ఎందుకంటే: ప్రధానంగా ద్విచక్ర వాహన రంగంలో బ్రేక్ షూ, డ్రమ్ బ్రేకింగ్ సిస్టమ్స్ తయారీలో దేశీయంగా ఆస్క్ ఆటోమోటివ్ నాయకత్వ స్థాయిలో ఉంది. రెండు విభాగాలు కలిపి 50 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. టూవీలర్ బ్రేకింగ్‌లోకి ఆలస్యంగా ప్రవేశించినప్పటికీ ఈ రంగంలో వినియోగించే తేలికపరచే(లైట్ వెయిటింగ్) అల్యూమినియం విడిభాగాలు, సేఫ్టీ కంట్రోల్ కేబుళ్ల(ఎస్‌సీసీ) తయారీలో సుప్రసిద్ధ కంపెనీగా కార్యకలాపాలు విస్తరించింది. మార్కెట్ వాటాను పెంచుకుంటోంది. ఇందుకు సొంత సాంకేతికతల అభివృద్ధి, డిజైన్, ఇంజినీరింగ్ సామర్థ్యాలు తోడ్పాటునిస్తున్నాయి. ప్రొప్రయిటరీ ఫార్ములేషన్స్ వినియోగించడం ద్వారా కస్టమర్ల అవసరాలకు అనుగుణమైన సొల్యూషన్లను అభివృద్ధి చేసి అందిస్తోంది. అంతేకాకుండా నాణ్యత, ధర, డెలివరీలపై దృష్టి పెట్టడం ద్వారా కస్టమర్లకు చేరువగా నిలుస్తోంది. వెరసి గత కొన్నేళ్లుగా ద్విచక్ర వాహన పరిశ్రమను మించిన వృద్ధిని సాధిస్తోంది. 2013–23 కాలంలో ద్విచక్ర వాహన పరిశ్రమ సగటున 10 శాతం వార్షిక వృద్ధిని అందుకుంది. అయితే విభిన్న ప్రొడక్టుల పోర్ట్‌ఫోలియో, కొత్త కస్టమర్లను జత చేసుకోవడం, ప్రస్తుత కస్టమర్ల నుంచి వాలెట్ షేర్‌ను పెంచుకోవడం ద్వారా పరిశ్రమను మించి ప్రగతి పథంలో పరుగెడుతోంది. ద్విచక్ర, త్రిచక్ర వాహన రంగంలో ఎలక్ట్రిక్ సాంకేతికతలకు ప్రాధాన్యత పెరుగుతోంది. ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) మార్పు కారణంగా అల్యూమినియం లైట్‌వెయిటింగ్ పరికరాల విభాగంలో కిట్ విలువ బలపడుతోంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 371/A/AA, Thanikella Village, Konijerla Mandal, Khammam Dist - 507 305, T.G., and Printed at Jagati Publications Limited, Survey No. 371/A/AA, Thanikella Village, Konijerla Mandal, Khammam Dist - 507 305, T.G., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08742-282823 - 24, Fax No.08742 - 282825, RNI Regn No. TEL TEL/2008/23797.